మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 7-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 128 Issue: 128

07 నవంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:20 సూర్యాస్తమయం - సా. 5:38 తిథి విదియ ఉ. 11:07 వరకు తరువాత తదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం రోహిణి రా. 12:340 వరకు తరువాత మృగశిర యోగం పరిఘ రా. 10:24 వరకు కరణం గరజి ఉ. 11:07 వరకు వనిజ రా. 9:19 వరకు వర్జ్యం తె. 5:34 నుండి ఉ. 7:00 వరకు దుర్ముహూర్తం మ. 12:22 నుండి మ. 1:07 వరకు మ. 12:22 నుండి మ. 1:07 వరకు రాహుకాలం ఉ. 10:35 నుండి ఉ. 11:59 వరకు యమగండం మ. 2:49 నుండి సా. 4:13 వరకు గుళికాకాలం ఉ. 7:45 నుండి ఉ. 9:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:44 నుండి తె. 5:32 వరకు అమృత ఘడియలు రా. 10:20 నుండి రా. 11:45 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com





# పీనుగులు పీక్కుతినేటోడు


'రేవంత్ రెడ్డి రూపంలో పీనుగలు పీక్క తినేటోడు వచ్చిండు' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు చైన్ స్నాచర్స్ అని.. వాళ్లతో జాగ్రత్త అని ప్రజలకు సూచించారు. ఎంఐఎంతో జత కడుతున్న కాంగ్రెస్ గెలిస్తే ఆడవాళ్ల మెడలో ఉన్న మంగళసూత్రం కూడా గుంజుకుపోతారు అని హెచ్చరించారు. 6 గ్యారంటీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి మాట తప్పాడని బండి సంజయ్ మండిపడ్డారు.

- రేవంత్ శరీరంలో పాకిస్థాన్ రక్తం
- తరచూ పాక్‌పై కాంగ్రెస్ నేతల ప్రేమ
- వారి డీఎన్ఏ చెక్ చేయించాల్సిందే
- కాంగ్రెసోళ్లు గెలిస్తే తాళిబొట్లూ ఎత్తుకెళ్తారు
- కేసీఆర్, కేటీఆర్ మూరు[illegible]లు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ మాస్ స్పీచ్
- వింటేజ్ వెర్షన్ చూపిన కేంద్ర మంత్రి

బోరబండ/హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తరఫున రోడ్ షోలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌పై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా మేం సభ పెట్టుకుంటే ఎవరికెందుకు నొప్పి? అనుమతి ఇచ్చి రద్దు చేస్తారా? మీ పర్మిషన్ సంకలో పెట్టుకోండి. పాతబస్తీలోనే సభ పెట్టి సత్తా చూపినం. ఈ బోరబండ మాది. బరాబర్ సభ పెడతాం' అని ప్రకటించారు. కాషాయ జెండాను రెపరెపలాడిస్తామని చెప్పారు. కాంగ్రెసోళ్లు తురకోళ్ల లెక్క టోపీ పెట్టుకున్నారని.. నమాజ్ పేరుతో డ్రామాలాడుతున్నారని -2 వ పేజీలో...

# కామారెడ్డిలో నకిలీ కలెక్టరమ్మ

గ్రూప్స్ ఉద్యోగం కోసం ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా, విజయం సాధించలేకపోతుండటంతో ఓ యువతి గొప్ప ప్లానే వేసింది. తనకు కలెక్టర్‌గా జాబ్ వచ్చిందంటూ కుటుంబసభ్యులకు చెప్పింది. నకిలీ ఉత్తర్వులనూ తయారు చేసింది. ఆపై వారిని తీసుకుని నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లింది. తన చాంబర్ ఎక్కడ అంటూ హల్‌చల్ చేసింది. సిబ్బందికి అనుమానం రావడంతో పోలీసులకు చిక్కింది. వివరాల్లోకెళితే.. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈ నెల 2 నుంచి సెలవులో ఉన్నారు.




కామారెడ్డి, నవంబర్ 6 (ఈవార్తలు): దీంతో నిజామాబాద్ కలెక్టర్‌కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే, ఈ నెల 4వ తేదీన మంగళవారం హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన ఇస్రత్ జహన్ అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ 26 ఏవై 5511 నంబరు ఉన్న కారులో కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చింది. కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన ఓ మహిళ తాను ఐఏఎస్‌ను అంటూ హంగామా సృష్టించింది. తనకు ఇన్చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించినట్లు నకిలీ ఉత్తర్వులను చూపించింది. ఈ సమయంలో ఇన్చార్జి కలెక్టర్.. పర్యటన నిమిత్తం బాన్సువాడ డివిజన్‌కు వెళ్లారు. ఆమె నేరుగా కలెక్టర్ చాంబర్ వైపు వెళ్లి, తాను ఐఏఎస్‌ను అంటూ పరిచయం చేసుకుంది. తాను సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌లో కమిషనర్‌గా పని చేస్తున్నట్లు చెప్పింది. 4వ తేదీ నుంచి తనను ఆశిష్ సాంగ్వాన్ స్థానంలో ఇన్చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించిందని ఉత్తర్వులను చూపించింది. స్థానిక అధికారులు ఆ ఉత్తర్వులను అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు పంపించారు. ఆ ఉత్తర్వుల ప్రతిని ప్రభుత్వ తరువాయి 2 వ పేజీలో...



# కేబినెట్ సమావేశం 12కు వాయిదా

శుక్రవారం జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12కు తెలంగాణ సర్కార్ వాయిదా వేసింది. 12వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. 12న జరిగే కేబినెట్‌లో గిగ్ వర్కర్స్ బిల్లును ప్రభుత్వం ఆమోదించనుంది.

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): కేబినెట్ ఆమోదం తర్వాత అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లు చేయనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం గత నెల (అక్టోబర్ 23 గురువారం)న గురువారం రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘంగా సమావేశమై పలు అంశాలపై చర్చించిన సంగతి తెలిసిందే. ఇద్దరికి మించి సంతానం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 21(3)ని తొలగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ కోసం గవర్నర్‌కు ఫైల్ పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.



# అన్ని స్కూళ్లలో వందేమాతరం పాడాలి!

# పిడికిలెత్తిన పాక్ జెన్ జీ

- పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పీఓకేలో నిరసనలు
- ఈసారి విద్యార్థుల నేతృత్వంలో ఆందోళనలు
- అధిక ఫీజులు, డిజిటల్ మార్కింగ్ విధానంపై ఆగ్రహం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. గత నెలలో పన్నులు, సబ్సిడీల కోసం జరిగిన హింసాత్మక ఆందోళనలు సద్దుమణగక ముందే.. ఇప్పుడు విద్యార్థులు రోడ్డెక్కారు. విద్యా సంస్కరణలు, అధిక ఫీజులకు వ్యతిరేకంగా 'జెన్-జీ' యువతరం ప్రారంభించిన ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో స్థానికంగా తీవ్ర గందరగోళం నెలకొంది.



ఇస్లామాబాద్: ముజఫరాబాద్‌లోని విశ్వవిద్యాలయాల్లో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. సెమిస్టర్ ఫీజుల పేరుతో ప్రతి 3–4 నెలలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. కొత్తగా -2 వ పేజీలో...



# పోటెత్తిన బీహార్ ఓటర్లు

**రికార్డు స్థాయిలో 64.66 శాతం పోలింగ్.. తొలి దశలో 121 స్థానాల్లో జరిగిన ఎన్నికలు**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. ఈ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాంతో, తొలి విడతలో రికార్డు స్థాయిలో 64.66 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం వెల్లడించింది.

పాట్నా: ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా రాష్ట్రంలోని 243 స్థానాలకుగానూ 121 స్థానాలకు గురువారం ఎన్నికలు జరిగాయి. జనం భారీగా తరలివచ్చి ఓటేయడంతో ఏ పార్టీకి లాభించనుందో -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,257 |
| వెండి (గ్రాము): | రూ.165 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,438 |



# వరల్డ్ క్లాస్ బ్యాంకులు రావాలి

**ఆర్బీఐ, ఇతర బ్యాంకులతో చర్చలు జరుపుతున్నాం: నిర్మల సీతారామన్**

దేశానికి ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరమని, ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్, ఇతర బ్యాంకులతో చర్చలు జరుగుతున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం అన్నారు. 12వ ఎస్బీఐ బ్యాంకింగ్, ఎకనామిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ప్రసంగిస్తూ.. జీఎస్టీ రేటు తగ్గింపు ఆధారిత డిమాండ్ మంచి పెట్టుబడి చక్రాన్ని విడుదల చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, పరిశ్రమకు క్రెడిట్ ప్రవాహాన్ని మరింతగా, విస్తృతం చేయాలని ఆర్థిక మంత్రి బ్యాంకులను కోరారు.

భారతదేశానికి చాలా పెద్ద, ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరమని తెలిపారు. ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం 2019 జనవరిలో ఐడిబిఐ బ్యాంక్‌లో తన నియంత్రణలో ఉన్న 51 శాతం వాటాను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)కి విక్రయించింది. ఆ తర్వాత ప్రభుత్వం, ఎల్ఐసీ ఐడీబీఐ బ్యాంక్‌లో తమ వాటాను వ్యూహాత్మక విక్రయానికి ప్రణాళికలు ప్రకటించాయి. అక్టోబర్ 2022లో ఇద్దరు వాటాదారులు మొత్తం 60.72 శాతం వాటాను విక్రయించడం ద్వారా ఐడీబీఐ బ్యాంక్‌ను ప్రైవేటీకరించడానికి పెట్టుబడిదారుల నుండి ఈవోఐని ఆహ్వానించారు. ఇందులో ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం వాటా, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం వాటా ఉన్నాయి. జనవరి 2023లో దీపం ఐడీబీఐ బ్యాంక్ కోసం చాలానే ఈవోఐలు వచ్చాయి. ఐడీబీఐ బ్యాంక్ అమ్మకానికి మార్గం సుగమం చేస్తూ సెబీ ఆగస్టు 2025లో రుణదాతలో వ్యూహాత్మక వాటా విక్రయం పూర్తయిన తర్వాత లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌ను బ్యాంక్ ప్రమోటర్ నుండి పబ్లిక్ షేర్ హోల్డర్‌గా తిరిగి వర్గీకరించడానికి ఆమోదం తెలిపింది. అంతేకాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏకీకరణను ప్రభుత్వం చేపట్టింది. బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద ఏకీకరణ వ్యాయామంలో భాగంగా ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...




# ఎస్బీఐ.. 8.86 లక్షల కోట్లు

**మార్కెట్ విలువలో అగ్రస్థానం**

సెప్టెంబర్ త్రైమాసికంలో ఊహించిన దానికంటే ఎక్కువ లాభాలు సాధించిన ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త మైలురాయిని చేరుకుంది. బ్యాంకు తొలిసారి గురువారం 100 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ మార్కును దాటింది. మన కరెన్సీలో రూ.8.86 లక్షల కోట్లకు సమానం.

న్యూఢిల్లీ: ఈ ఏడాది పండుగ సీజన్ సందర్భంగా రిటైల్ కొనుగోళ్లు పెరగడంతో మెరుగైన క్రెడిట్ వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో సెప్టెంబర్ నాటికి రూ.44.20 లక్షల కోట్ల అడ్వాన్సులు, రూ. 55.92 లక్షల కోట్ల డిపాజిట్లతో కలిపి రూ.100 లక్షల కోట్ల వ్యాపార మార్కును తరువాయి 2 వ పేజీలో...



# ఆర్టీసీ డ్రైవర్‌దే తప్పు

**మా డ్రైవర్‌ది తప్పు లేదు.. తాగి నడిపాడన్నది అవాస్తవం.. టిప్పర్ యజమాని లక్ష్మణ్ నాయక్**

చేవెళ్ల ప్రమాదానికి కారణం టిప్పర్ డ్రైవర్ కాదని, ఆ టిప్పర్ యజమాని లక్ష్మణ్ నాయక్ అన్నారు. బస్సు డ్రైవర్ వేగంగా వస్తూ గుంతను తప్పించబోయి తమపైకి దూసుకొచ్చాడని చెప్పారు. వెంటనే డ్రైవర్ ఆకాశ్ తనను నిద్రలో నుంచి లేపాడని తెలిపారు. సైడ్‌కు తీసుకోవాలని డ్రైవర్‌కు చెప్తుండగానే.. ఆర్టీసి బస్సు తమపైకి దూసుకొచ్చిందని అన్నారు. దీంతో ప్రమాదం జరిగిందని తెలిపారు

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): . టిప్పర్ డ్రైవర్ మద్యం తాగి వాహనం నడిపాడని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశాడు. టిప్పర్ డ్రైవర్ గుంతను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో 19 మంది మరణించినట్టుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే బస్సును ఢీకొట్టడానికి ముందు టిప్పర్ డ్రైవర్ బ్రేకు వినియోగించకపోవడం వల్లే ఇది జరిగి ఉండొచ్చని ట్రాఫిక్ పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. టిప్పర్‌లో పరిమితికి మించి కంకర లోడు, అతివేగంతో ఉండటం వల్ల ఒక్కసారిగా కుడివైపునకు తిప్పడంతో అదుపుతప్పి నియంత్రణ కోల్పోయినట్లు అంచనా వేస్తున్నారు.రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న రోడ్డు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జపాన్‌కు చెందిన ఒటోవ్రూ కాటయామా అనే వ్యక్తి 20 ఏళ్ల క్రితం తన భార్యతో గొడవ పడి మాట్లాడటం మానేశాడు. ఏదైనా చెప్పాల్సి వస్తే ఆ.. ఊ.. అని అన్నాడు తప్ప, భార్యతో నేరుగా మాట్లాడలేదు. ఆశ్చర్యకర విషయం ఏంటంటే.. తన భార్యతో 20 ఏళ్లు మాట్లాడకున్నా, ఆమెతో కలిసి ముగ్గురు పిల్లలను కన్నాడా మహానుభావుడు. ఈ మధ్యే వాళ్ల చిన్న కొడుకు చొరవతో తన భార్యతో మాట్లాడటం మొదలుపెట్టాడు.

## రాశి ఫలాలు
7.11.2025

మేషం: చేపట్టిన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు తీర్చగలుగుతారు. వృత్తి వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికంగా మరింత పుంజుకుంటారు. కుటుంబ వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహా తీసుకోవడం మంచిది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. చిన్ననాటి మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. స్త్రీ సంబంధిత సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. వ్యాపారమున అవరోధాలు తప్పవు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: వ్యాపారాలు ఆశించిన విధంగా ముందుకు సాగుతాయి. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రతి వ్యవహారాన్ని పెద్దలతో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: బంధుమిత్రుల నుండి విమర్శలు అధికమవుతాయి. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన వ్యవహారాలలో ఎంత శ్రమపడిన ఫలితం అంతగా కనిపించదు.

సింహం: ఆర్థికంగా కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించడం మంచిది. వ్యాపార విస్తరణకు కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పవు. ప్రముఖుల నుండి సభ సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి.

కన్య: వృత్తి ఉద్యోగాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సంతాన విద్య విషయాలలో మరింత కష్ట పడవలసి వస్తుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగినప్పటికి నిదానంగా పూర్తవుతాయి. ధన పరంగా ఇతరులకు మాట ఇచ్చే విషయంలో పునరాలోచన చేయుటం మంచిది.

తుల: స్థిరస్తి క్రయ విక్రయాలలో స్వల్ప నష్టాలు తప్పవు. ఇతరుల విషయంలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. దూరప్రాంత బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమౌతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

వృశ్చికం: దూర ప్రయాణాలలో జాగ్రత్త వహించటం మంచిది. నిరుద్యోగులు లభించిన అవకాశాలను చేజారకుండా చూసుకోవాలి. ఆర్థిక పరిస్థితి కొంత అనుకూలంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగాలు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి.

ధనస్సు: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి లభించదు. భాగస్వామ్య వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. వాహన ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

మకరం: బంధు మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. నూతన ఋణ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. కొన్ని రంగాల వారికి చిన్నపాటి ఇబ్బందులు తప్పవు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు.

కుంభం: ప్రభుత్వ సంబంధిత వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. శత్రు సమస్యలు నుండి ఉపశమనం లభిస్తుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు ఉత్సాహనిస్తాయి. ఉద్యోగమున ఇతరులతో జాగ్రత్తగా వ్యవహారించాలి. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మీనం: దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వృత్తి, వ్యాపారాలలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు కలసివస్తాయి.

# పీనుగులు పీక్కుతినేటోడు

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను హిందువు. ఇతర మతాలను గౌరవిస్తా తప్ప కించపర్చను. టోపీ పెట్టుకునే పరిస్థితే వస్తే తల నరుక్కుంటా. కాంగ్రెసోళ్లు అనుమానమొస్తుంది. వీళ్ల డీఎన్ఏను చెక్ చేయాల్సిందే. బండి సంజయ్‌ను ఆపడం మీ తరం కాదు. ఇది మీ అయ్య జాగిరా? కేసీఆర్ గడీలు బద్దలు కొట్టి ఫాంహౌజ్ కొట్టింది మేం' అని తెలిపారు. ప్రజలు అల్లాడుతుంటే ఓదార్చింది తామని.. రైతుల బాధను పంచుకుంది తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కాంగ్రెస్, రేవంత్ రెడ్డికి కనువిప్పు కావాలని అన్నారు. బోరబండలో కాంగ్రెస్ రెండేళ్లలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ చేయాలని ఇండ్లు కూల్చిన కాంగ్రెసోళ్లు అక్కడ ఎంఐఎం షాపులు మాత్రం కూలగొట్టడం లేదు విస్తరణ చేయడం లేదని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే బుల్డోజర్లు పెట్టి వాటిని కూల్చివేయిస్తానని బండి సంజయ్ హెచ్చరించారు. 'హైదరాబాద్ అభివృద్ధిపై లెక్కాపత్రంతో చర్చించేందుకు మేం సిద్ధం. మేం అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే రేవంత్ రెడ్డి మతం గురించి మాట్లాడుతున్నాడు. వాళ్లవి లక్ష ఓట్లు మాత్రమే మరి మన ఓట్లు 3 లక్షలు ఓట్లు. కానీ వాళ్ల ఓట్ల కోసం ఒవైసీ సంకనాకుతున్నాడు' అని రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము చెప్పినట్లు వినాల్సిందేనని ఒవైసీ చెప్పినా పౌరుషం లేని దద్దమ్మలు కాంగ్రెసోళు అని మండిపడ్డారు. ఒక వర్గం ఓట్ల కోసం టోపీ పెట్టుకున్న రేవంత్ రెడ్డిని చూస్తే సినిమా యాక్టర్ వేణుమాధవ్ గుర్తుకొచ్చాడని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రేవంత్ టోపీ పెట్టుకుంటే పక్కనే ఉన్న



అజారుద్దీన్ కూడా ఓట్ల బిచ్చగాళ్ల లెక్క చూసి నవ్వుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి 40 వేల బురఖాలను తెప్పించాడట? బురఖాలు వేయించి దొంగ ఓట్లు వేయించుకుని గెలవాలని చూస్తున్నాడు అని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దొంగ ఓట్లపై నజర్ పెట్టాలని ఎన్నికల సంఘానికి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. 'కాంగ్రెసోళ్లను చూస్తుంటే అనుమానమొస్తుంది. వీళ్ల డీఎన్ఏను చెక్ చేయాల్సిందే..' అంటూ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వెనుక మాజీ మంత్రి కేటీఆర్ హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. 'ఇది నా మాట కాదు. గోపీనాథ్ తల్లి చెప్పిన మాటనే చెబుతున్నా. సీఎం రేవంత్ రెడ్డికి ఏ మాత్రం పౌరుషమున్నా గోపీనాథ్ మరణంపై సమగ్ర దర్యాప్తు చేయించాలి. కేటీఆర్ ను బొక్కలో వేసి థర్డ్ డిగ్రీ విచారణ చేయాలి. అప్పుడే వాస్తవాలు బయటపడతాయి' అని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ పెద్ద మూరు□డు.. ఆయన కొడుకు ఇంకా మూరు□డు. ఈమధ్య జనతా గ్యారేజ్ డైలాగ్ కొడుతున్నడు. మూడేళ్ల తరువాత వాళ్ల అయ్య బయటకు వస్తడట. సీఎం అయితడు. జనం చస్తుంటే రాడు.. రైతులు అల్లాడుతుంటే రాడు. యాక్సిడెంట్స్ అయి జనం పోతుంటే రాడు... ఇగ సీఎం ఎక్కడైతడు? అసలు కేటీఆర్ కు తండ్రి సీఎం కావాలనే ఆశ లేనేలేదు....తండ్రిని పక్కకు తోసి ఎప్పుడెప్పుడు సీఎం కావాలని చూస్తున్నడు కేటీఆర్‌కు వావి వరసల్లేవు. చిన్నా పెద్దా ముసలి ముతక అనే తేడా లేనే లేదు. హింస పెట్టిండు.. కల్వకుంట్ల కవిత.. అంతో ఇంతో తల్లిదండ్రులను అంతో ఇంతో మంచిగ చూసుకునేది ఆడపిల్లలే. మీ అన్న, మీ బావ, మీ బాబాయి కొడుకుతో జాగ్రత్త. అప్పుడప్పుడు కేసీఆర్ దగ్గరకు వెళ్లి బాగోగులు చూసుకో' అని సలహా ఇచ్చారు. 'బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తానన్న రేవంత్ రెడ్డి.. రూ.9 వేల కోట్ల అవినీతిపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాసిండు. ఎవరిని కాపాడేందుకు లక్ష కోట్ల అవినీతిపై విచారణ అడగడం లేదు? కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే. దేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి దోచుకున్న పార్టీలు ఏవైనా ఉన్నాయంటే అవి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే. హైదరాబాద్ లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే అది మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులేవి? అని నేను సవాల్ చేస్తున్నా. హిందువులారా.. మీరంతా ఓటు బ్యాంకుగా మారి మీ సత్తా చాటండి. ముస్లింల ఇండ్లకు పోయి మిక్సర్, గ్రైండర్, కుట్టు మిషన్లు ఇస్తూ దందం పెడుతున్నరు. హిందువులను మాత్రం పట్టించుకోవడం లేదు. రేవంత్ రెడ్డి 40 వేల బురఖాలను తెప్పించాడట. బురఖాలు వేయించి దొంగ ఓట్లు వేయించుకుని గెలవాలని చూస్తున్నడు. ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నా.. మీరు దొంగ ఓట్లపై నజర్ పెట్టండి. రాముడి వారసులైన బీజేపీకి ఓటేయాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరుతున్నా. 3 లక్షల మంది హిందూ ఓటర్లంతా ఒక్కటైతే ఎట్లా ఉంటదో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు రుచి చూపించాలన్నారు.

## పిడికిలెత్తిన పాక్ జెన్ జీ

మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెట్టిన డిజిటల్ అసెస్‌మెంట్ సిస్టమ్ (ఈ-మార్కింగ్) వల్లే అక్టోబర్ 30న విడుదలైన మొదటి సంవత్సరం ఫలితాల్లో తమకు ఊహించిన దానికంటే తక్కువ మార్కులు వచ్చాయని వారు మండిపడుతున్నారు. కొందరైతే పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు కూడా పాస్ అయ్యారని ఆరోపించడం గమనార్హం. శాంతియుతంగా జరుగుతున్న ఈ నిరసనలు ఇటీవల హింసాత్మకంగా మారాయి. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరపడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహించిన విద్యార్థులు టైర్లకు నిప్పుపెట్టి, విధ్వంసానికి పాల్పడ్డారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ పరిణామాలు ఇటీవల నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన విద్యార్థి ఉద్యమాలను గుర్తుచేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనలతోనే షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. ఈ ఏడాది నేపాల్‌లోనూ విద్యార్థి ఉద్యమ తీవ్రతకు కేపీ ఓలీ సర్కారు రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం పీఓకేలో యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి రావడం షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పిగా మారింది. ఇప్పటికే ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఆందోళనలు ఎలాంటి మలుపు తీసుకుంటాయోనన్న ఆసక్తి నెలకొంది.

## పోటెత్తిన బీహార్ ఓటర్లు

మొదటి పేజీ తరువాయి

తెలియాల్సి ఉంది. అయితే.. అన్ని పార్టీల నేతలు ఓటర్లు తమకే మద్దుతు పలికారనే నమ్మకంతో ఉన్నారు. డిప్యూటీ కలెక్టర్‌పై దాడి మినహా తొలి విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఈసీ చెప్పారు. అయితే.. తమ పార్టీ మద్దతుదారులున్న స్ట్రాంగ్ బూత్‌ల వద్ద తరచూ విద్యుత్ కోత ఏర్పడిందని మహాగఠ్ భందన్ నేతలు ఫిర్యాదు చేశారు. తొలి విడత ఎన్నికల్లో పోలింగ్ జరిగిన నియోజకవర్గాల్లో మహాఘఠ్ బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ (రఘోపూర్), లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు, జనశక్తి జనతాదళ్ నేత తేజ్ ప్రతాప్ యాదవ్ (మహువా), ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సామ్రాట్ చౌదరి (తారాపూర్) ఉన్నారు. రెండో విడత ఎన్నికలు నవంబర్ 11న జరుగునున్నాయి.

## వరల్డ్ క్లాస్ బ్యాంకులు రావాలి

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 2019లో నాలుగు ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాలను ప్రకటించింది. దీనితో 2017లో వాటి మొత్తం సంఖ్య 27 నుండి 12కి తగ్గింది. 2020 ఏప్రిల్ 1 నుండి యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో విలీనం అయ్యాయి. సిండికేట్ బ్యాంక్ కెనరా బ్యాంక్‌లో విలీనం అయ్యాయి, అలహాబాద్ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్‌లో విలీనం అయ్యాయి, ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం అయ్యాయి. 2019లో దేనా బ్యాంక్, విజయ బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేశారు. దీనికి ముందు ప్రభుత్వం ఎస్బీఐ, భారతీయ మహిళా బ్యాంక్ ఐదు అనుబంధ బ్యాంకులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేసింది. కాగా, అంతకుముందు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల ఆర్థిక సంఘటితానికి, జాతీయ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు సరికాదని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయీకరణ వల్ల అనుకున్న ఫలితాలు రాలేదన్నారు. "బ్యాంకుల జాతీయీకరణ వల్ల ప్రాధాన్యతా రంగాలకు, ప్రభుత్వ పథకాలకు సహాయం చేయగలిగాం. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రొఫెషనల్‌గా ఉండలేకపోయాయి. జాతీయీకరణ జరిగిన 50 ఏళ్ల తర్వాత కూడా అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయాయి. ప్రైవేటీకరణ వల్ల బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరి దగ్గరకూ తీసుకెళ్లలేమన్నది తప్పు" అని బ్యాంక్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అన్నారు.

### నిర్మలా వ్యాఖ్యలపై బ్యాంక్ యూనియన్ల ఫైర్

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను బ్యాంకు యూనియన్లు తీవ్రంగా ఖండించాయి. దేశానికి ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంతోసేవ చేస్తున్నాయని, అలాంటి బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న ఉద్దేశాలు మానుకోవాలని హితవుపలికాయి. మూలధన సాయం అందించి బ్యాంకులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 9 ట్రేడ్ యూనియన్లతో కూడిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద 90 శాతం ఖాతాలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే తెరుచుకున్నాయని యూఎఫ్‌బీయూ గుర్తు చేసింది. ప్రాధాన్యతా రంగాలకు, ప్రభుత్వ పథకాలు ఈ బ్యాంకుల ద్వారానే అందుతున్నాయని తెలిపింది. గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత ప్రభుత్వరంగ బ్యాంకులతోనే సాధ్యమైందని పేర్కొంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఇంతటి పటిష్ఠంగా ఉండడానికీ పీఎస్‌బీలే కారణమంది. అలాంటి పీఎస్‌బీలను ప్రైవేటీకరిస్తే జాతి ప్రయోజనాలకు విఘాతం కలుతుందని పేర్కొంది. ఉద్యోగ భద్రతతో పాటు, ప్రజల సొమ్ముకూ భద్రత ఉండబోదని తెలిపింది. ప్రైవేటీకరణ వల్ల కార్పొరేట్లకే తప్ప ప్రజలకు ప్రయోజనం ఉండబోదనని తెలిపింది. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించబోమని ప్రభుత్వం నుంచి హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. మూలధనం, టెక్నాలజీ ఆధునికీకరణ, పారదర్శక పాలన ద్వారా బ్యాంకులను బలోపేతం చేయాలని కోరింది. డిపాజిటర్లు, ఉద్యోగులు, సాధారణ పౌరులపై ప్రభావం చూపే ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకోవడానికైనా ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడంతో పాటు పార్లమెంట్ వేదికగానూ చర్చ జరగాలని యూఎఫ్‌బీయూ సూచించింది. జాతీయీకరణకంటే ముందు బ్యాంకులు పారిశ్రామిక వేత్తలు, పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే సేవలందించిన విషయాన్ని యూఎఫ్‌బీయూ గుర్తుచేసింది. ప్రైవేటీకరణ తర్వాతే రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు, గ్రామీణ ప్రాంత రైతులకు రుణాలు లభిస్తున్నాయంది. ప్రభుత్వరంగ బ్యాంకులు లక్షలాది గ్రామాలకు విస్తరించగా.. ప్రైవేటు బ్యాంకులు గ్రామీణ స్థాయిలో నామమాత్రంగానే సేవలందిస్తున్నాయని గుర్తుచేసింది. ఆర్థికమాంద్యం, కొవిడ్ వంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వరంగ బ్యాంకులు దేశానికి వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొంది.

## కామారెడ్డిలో నకిలీ కలెక్టరమ్మ



మొదటి పేజీ తరువాయి

పరిపాలన శాఖకు పంపించామని, తర్వాత నిర్ణయం చెబుతామని ఆయన సమాచారం పంపారు. దాంతో అప్పటిదాకా చాంబర్‌లో కూర్చున్న ఆమె, వెంటనే అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ రావు.. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పరిశీలించి, ఆ మహిళను మెదక్ జిల్లా తూప్రాన్ వద్ద అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఆమెను ప్రశ్నించారు. సదరు మహిళ 2020 నుంచి గ్రూప్స్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతోందని, తనకు ఉద్యోగం వచ్చినట్లు కుటుంబ సభ్యులను నమ్మించేందుకు కామారెడ్డిలో ఇన్చార్జి కలెక్టర్‌గా పోస్టింగ్ తీసుకోవడానికి యత్నించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆమెపై చీటింగ్ కేసు పెట్టి వదిలేశామని పేర్కొన్నారు.

## ఎస్బీఐ.. 8.86 లక్షల కోట్లు

మొదటి పేజీ తరువాయి

చేరుకుంది. మార్కెట్ క్యాప్ పరంగా దేశీయంగా 228 బిలియన్ డాలర్ల(రూ.20.21 లక్షల కోట్ల)తో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 170 బిలియన్ డాలర్ల (రూ.15 లక్షల కోట్ల)తో రెండో స్థానంలో ఉంది. భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ మార్కెట్ విలువను కలిగి ఉన్నాయి. మొదటి ఆరు అతిపెద్ద కంపెనీల్లో మూడు బ్యాంకులే ఉండటం గమనార్హం.






## ఆర్టీసీ డ్రైవర్‌దే తప్పు

మొదటి పేజీ తరువాయి

ప్రమాదాల నేపథ్యంలో పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చేనెల నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్టుగా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన అనంతరం డీజీపీ ఈ వ్యాఖ్యలు చేశారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే చేవెళ్ల బస్సు ప్రమాదం జరిగిందన్నారు. రోడ్డు పరిస్థితిని బట్టి స్పీడ్ నియంత్రణ ఉండాలని తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. దర్యాప్తు అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓఆర్ఆర్, నేషనల్ హైవేలపై హైస్పీడ్‌కు అనుమతి ఉందని.. అక్కడ వాహనాలు నడిపిన డ్రైవర్లు సాధారణ రోడ్లపై సైతం అదే స్పీడ్‌తో వెళ్లడం సరైనది కాదన్నారు. వాహనదారుల అతివిశ్వాసం రోడ్డు ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు.

## అన్ని స్కూళ్లలో వందేమాతరం పాడాలి!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని స్కూళ్లల్లో వందేమాతరం గీతం ఆలపించాలని ఉత్తర్వులు పంపింది. వందేమాతరం రచించి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టాలని కేంద్రం రాష్ట్ర సీఎస్‌లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సర్కార్ తాజాగా స్కూళ్లకు ఉత్తర్వులిచ్చింది. పాఠశాలతోపాటు, కలెక్టరేట్లు, అన్ని ప్రభుత్వ ఆఫీసులలో తప్పనిసరిగా వందేమాతరం పాడాలని పేర్కొంది. కాగా దేశ ప్రజలంతా అందులో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు పిలుపునిచ్చింది.

# త్వరలోనే అసెంబ్లీ ముందుకు గిగ్ బిల్లు

**కనీస వేతన చట్టం అమలయ్యేలా**

**చర్యలు: మంత్రి వివేక్**

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): వివిధ రంగాలలో పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. త్వరలోనే గిగ్ వర్కర్ల బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. గురువారం వివిధ యూనియన్లతో చర్చించిన మంత్రి.. గిగ్ వర్కర్లకు న్యాయం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఎంతో మంది గిగ్ వర్కర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని.. అన్ని రంగాల్లో గిగ్ వర్కర్లకు అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి వివేక్ అన్నారు. ఎన్నికల ముందు గిగ్ వర్కర్లకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆ మేరకు వారికి మేలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని చెప్పారు. గిగ్ వర్కర్లకు కనీస వేతనాలు వచ్చేలా అగ్రిగేటర్స్ తో మాట్లాడి నిర్ణయానికి రావాలని రాహుల్ గాంధీ చెప్పినట్లు గుర్తు చేశారు. రాహుల్ సూచనల మేరకు వర్కర్లకు న్యాయం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. గిగ్ వర్కర్లు ఒక్కొక్కరు గంట జొమాటోకు పనిచేస్తే , మరో గంట స్విగ్గీకి చేస్తారని.. వారికి కనీస వేతన చట్టం ఎలా అమలు చేయాలనే దానిపై చర్చిస్తున్నట్లు చెప్పారు. 1962 లో తీసుకొచ్చిన మినిమమ్ వేజెస్ చట్టంలో ఎన్నో మార్పులు వచ్చాయని.. ప్రస్తుతం వర్కర్లకు న్యాయం చేసేందుకు కావాల్సిన మార్పుల గురించి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. గిగ్ వర్కర్లకు సంబంధించిన డ్రాఫ్టింగ్ పూర్తవుతోందని.. త్వరలోనే అసెంబ్లీకి వెళ్తుందని చెప్పారు. ఇప్పటి వరకు వారికి భద్రత లేదని.. వారికి భద్రత ఎలా కల్పించాలనే కోణంలో ఆలోచిస్తున్నామని చెప్పారు. ఈ అంశాలన్నీ డ్రాఫ్ట్ లో పొందుపరుస్తున్నామని తెలిపారు. త్వరలోనే పరిష్కారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వర్కర్లకు హామీ ఇచ్చారు.



# సర్కారు బడుల్లో కంప్యూటర్ టీచర్లు

**నెలకు రూ.15,000 వేతనం**



హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత కంప్యూటర్ టీచర్ల (ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్ల) నియామకానికి పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 5 లేదా అంతకంటే ఎక్కువ కంప్యూటర్లు ఉన్న 2,837 పాఠశాలలను అధికారులు గుర్తించారు. ఈ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ (టీజీటీఎస్) ద్వారా త్వరలోనే ఈ నియామక ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 చొప్పున పది నెలల పాటు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ వ్యయాన్ని సమగ్ర శిక్షా నిధుల నుంచి భరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో సుమారు 20 ఏళ్ల క్రితం 4,200 పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, ఐదేళ్ల కాలపరిమితితో ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. అయితే, ఆ తర్వాత వారిని తొలగించడంతో కంప్యూటర్ ల్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. సరైన పర్యవేక్షణ కొరవడి చాలా కంప్యూటర్లు మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా నియమించే బోధకులు ల్యాబ్‌ల నిర్వహణతో పాటు విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అమలవుతున్న పలు డిజిటల్ కార్యక్రమాల విజయవంతానికి కూడా ఈ నియామకాలు దోహదపడనున్నాయి. ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో 1,354 పాఠశాలల్లో అమలు చేస్తున్న 'అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మ్యాథ్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్', ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించిన 'ఖాన్ అకాడమీ' ఆన్‌లైన్ తరగతుల వంటివి సమర్థవంతంగా నడవాలంటే కంప్యూటర్లపై అవగాహన ఉన్న బోధకుల అవసరం ఎంతో ఉంది. ఈ కొత్త నియామకాలతో ప్రభుత్వ పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లు తిరిగి తెరుచుకొని, డిజిటల్ విద్యాబోధనకు కొత్త ఊపు వస్తుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

# రేవంత్‌పై చర్యలేవి?



**ఈసీకి మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూటి ప్రశ్న**

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాలు కోడ్‌ను ఉల్లంఘించేలా ఉన్నా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఈసీని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే పథకాలు బంద్ అవుతాయని సీఎం అనడం కోడ్ ఉల్లంఘన కాదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి ఇంకా మూడు రోజుల గడువే ఉంది. ఎన్నికల కమిషన్ దృష్టికి బీఆర్ఎస్ చాలా అంశాలు తీసుకెళ్లింది. బీఆర్ఎస్ తరపున కేంద్ర ఎన్నికల సంఘంతో సంప్రదింపులకు కేసీఆర్ తనతో పాటు సోమా భరత్‌ను నియమించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు మేము కేటీఆర్‌తో కలిసి ఇటీవలే ఢిల్లీ వెళ్లి మా అభిప్రాయాలు చెప్పాం. దురదృష్టవశాత్తు కేంద్ర ఎన్నికల సంఘం పక్ష పాత వైఖరితో పని చేస్తోంది. గత శాసనసభ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మా పార్టీ నేతల పై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. మా అధినేత కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిలపై ఏవో వ్యాఖ్యలు చేశారని అప్పట్లో 48 గంటల పాటు వారి ప్రచారం పై నిషేధం విధించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాలు కోడ్‌ను ఉల్లంఘించేలా ఉన్నా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఈసీని సూటిగా ప్రశ్నిస్తున్నాము. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలు బంద్ అవుతాయని సీఎం అనడం కోడ్ ఉల్లంఘన కాదా ? బీఆర్ఎస్‌కు ఓటేస్తే జూబ్లీహిల్స్‌కు రానని అజారుద్దీన్ అనడం కోడ్ ఉల్లంఘన కాదా ? కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం ఎలా చేస్తారో చూస్తా అని బెదిరించడం కోడ్ ఉల్లంఘన కాదా..? ఇక్కడి ఎన్నికల ప్రధానాధికారికి ప్రతిరోజూ మా నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోరా..? అని వినోద్ కుమార్ ప్రశ్నించారు.



# చీమలతో బతకలేను.. చనిపోతున్నా!

**సూసైడ్ నోట్ రాసి మహిళ బలవన్మరణం**

**పటాన్‌చెరు అమీన్‌పూర్‌లో విషాద ఘటన**

**చీమల ఫోబియాతో వివాహిత ఆత్మహత్య**

పటాన్‌చెరు, నవంబర్ 6 (ఈవార్తలు): ఓ వింత ఫోబియా ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. చీమలంటే తీవ్రమైన భయంతో బాధపడుతున్న ఓ వివాహిత తనువు చాలించింది. ఈ హృదయ విదారక ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌లోని శర్వా హోమ్స్‌లో శ్రీకాంత్, మనీషా (25) దంపతులు నివసిస్తున్నారు. కొంతకాలంగా మనీషా చీమలంటే తీవ్ర భయంతో (మైర్మెకోఫోబియా) బాధపడుతోంది. ఈ సమస్యను గమనించిన కుటుంబ సభ్యులు ఆమెకు ఆసుపత్రిలో చికిత్సతో పాటు కౌన్సిలింగ్ కూడా ఇప్పించారు. అయితే, ఆమె పరిస్థితిలో మార్పు రాలేదు. మంగళవారం సాయంత్రం భర్త శ్రీకాంత్ విధులకు వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బెడ్‌రూమ్ తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉంది. ఎంత పిలిచినా స్పందన రాకపోవడంతో ఆందోళన చెంది, స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ మనీషా ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మనీషా రాసిన ఓ సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. "శ్రీ.. ఐయాం సారీ.. ఈ చీమలతో బ్రతకడం నావల్ల కావట్లేదు. కూతురు అన్వి జాగ్రత్త. అన్నవరం, తిరుపతి, ఎల్లమ్మ మొక్కులు తీర్చండి" అని లేఖలో రాసి ఉంది. ఈ లేఖ కుటుంబ సభ్యులను కన్నీటిపర్యంతం చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# బియ్యాన్ని తరలించేందుకు 75 వేల లంచం

**ఏసీబీకి పట్టుబడ్డ**

**పౌరసరఫరాల కార్యాలయ మేనేజర్**

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన**

ఆసిఫాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని గోదాము నుండి ఆసిఫాబాద్‌లోని పౌర సరఫరాల గోదాముకు తరలించడానికి అనుమతి ఇవ్వడానికి రూ. 75,000 లంచం తీసుకుంటున్న పౌర సరఫరాల అధికారిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా పౌర సరఫరాల కార్యాలయ మేనేజర్ గురుబెల్లి వెంకటనర్సింహారావు, పీఏ (పొరుగు సేవల ఉద్యోగి) కొత్తగొల్ల మణికాంత్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని తన గోదాము నుండి ఆసిఫాబాద్‌లోని పౌర సరఫరాల గోదాముకు తరలించేందుకు అధికారులు తన నుండి రూ. 75,000 లంచం డిమాండ్ చేస్తున్నారని బాధితుడు ఒకరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు వ్యూహం పన్ని వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



# జూబ్లీహిల్స్‌లో బలగాలను దించండి

**ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు కలిసి అల్లర్లు సృష్టించి రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉన్నందున కేంద్ర బలగాలను దించాలని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని సీఈసీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు ఫిర్యాదు చేశారు. తెలంగాణలో హోంమంత్రిత్వ శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నందున, పోలీసులు ఎన్నికలలో పారదర్శకంగా వ్యవహరిస్తారనే నమ్మకం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కూడా సీఈసీకి ఫిర్యాదు చేసింది. పోలింగ్ రోజున మజ్లిస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు అధికార పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం ఓట్ల రిగ్గింగ్, దొంగ ఓట్లకు పాల్పడే అవకాశం ఉందని ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేసింది. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, తక్షణమే కేంద్ర బలగాలను నియమించాలని కోరింది. అటు.. ఎన్నికల ప్రచారం సమయంలో ముస్లింలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద బీఆర్ఎస్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసింది. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, షకీల్, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత

**గెలుపు సర్వేల్లో తేలడం లేదు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై సర్వేల్లోనూ స్పష్టత రావడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తమ హామీల గురించి ప్రస్తావించడం లేదని, ఇచ్చిన గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడుతున్నారని, అన్ని సమస్యలకు అదే పరిష్కారమన్నట్లు వ్యవహరించడం వారి మూర[illegible]త్వమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఎక్కువ వాటా కేంద్రానిదేనని, ఆ పథకాన్ని ఆపేస్తామని సీఎం ఎలా అంటారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుకు గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో ఉండే కనీస అభివృద్ధి కూడా ఇక్కడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా నిధులు లేవని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైందని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై నమ్మకం లేకపోవడంతో జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోలేకపోతున్నారని, ఈ గందరగోళం సర్వేల్లోనూ ప్రతిబింబిస్తోందని ఆయన విశ్లేషించారు.

# రైతు నుంచి 10 వేలు తీసుకుంటూ.. ఏసీబీకి పట్టుబడ్డ మండల వ్యవసాయ అధికారి

మహబూబాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): రైతు కుటుంబం నుంచి రూ. 10,000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఒక అధికారి అడ్డంగా దొరికిపోయాడు. మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారి జీ. సందీప్ ఏసీబీకి పట్టుబడ్డాడు. జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబం ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తన రైతు బీమా పరిహార దస్తావేజును ప్రాసెస్ చేసి, దానిని ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించడానికి రూ. 10,000 లంచం అడిగాడని ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుని నుంచి రూ. 10,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.


# డ్రగ్స్‌కు కేటీఆరే కారణం: తుమ్మల



హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెరిగిన డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే మూలమంటూ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న 'బాకీ కార్డు' ప్రచారాన్ని తిప్పికొడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, రాష్ట్రంపై పెట్టిన లక్షల కోట్ల అప్పుల సంగతేంటని నిలదీశారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 20 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రేవంత్ రెడ్డి పాలన కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తుమ్మల తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, రోజూ ఎందరో పారిశ్రామికవేత్తలు కొత్త పెట్టుబడులతో తెలంగాణకు వస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలని తుమ్మల హితవు పలికారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. అలాంటి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు" అని ఆయన అన్నారు.

# అసెంబ్లీ రాకుండా అధికారమెలా?

**బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్**



హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): గత రెండేళ్లుగా అసెంబ్లీకే రాని కేసీఆర్ రాబోయే మూడేళ్ల తర్వాత అధికారంలోకి ఎలా వస్తారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ నగర అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఈరోజు లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇక్కడ పని చేస్తున్నారంటే అందుకు పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లకు అమ్మివేసిందని ఆయన ఆరోపించారు. కేటీఆర్ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని, స్వయంగా ఆయన సోదరి కవిత ఆరోపణలు చేస్తున్నారని, వాటికి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మొదటిసారి అధికారంలోకి వచ్చి కాళేశ్వరం పేరుతో, రెండోసారి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ధరణి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుందని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉండగా దోచుకున్న సొమ్మును పంచుకునే విషయంలో విభేదాలు రావడం వల్లే ఆ కుటుంబంలో పంచాయతీ వచ్చిందని అన్నారు. వాటాల కోసం పోట్లాడుకుంటున్నారని విమర్శించారు. కేటీఆర్ సెంటిమెంట్ మాటలను నమ్మి మోసపోతే ప్రజలు ఇబ్బందిపడతారని హెచ్చరించారు. ఓటు వేసే ముందు ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులంతా కలిసికట్టుగా ఇక్కడ అభివృద్ధి చేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు.

# నిర్లక్ష్యం వద్దు సోదరా!

**కలసి కట్టుగా పనిచేయాలి.. మంత్రులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలి**

**సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**



హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మరియు అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓటింగ్‌కు మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొత్తం మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్డు షోలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్షించినట్లు సమాచారం.

# వరంగల్‌లో శ్రీలీల సందడి

వరంగల్, నవంబర్ 6 (ఈవార్తలు): ప్రముఖ సినీ నటి శ్రీలీల తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో సందడి చేశారు. నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వస్త్ర దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం షాపింగ్ మాల్‌లో సరికొత్త డిజైన్‌లను ఆమె ఆవిష్కరించారు. శ్రీలీలను చూసేందుకు అధిక సంఖ్యలో సినీ అభిమానులు, ప్రజలు షాపింగ్ మాల్ వద్దకు తరలి వచ్చారు. అభిమానులు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించారు. కొందరు అభిమానులతో ఆమె సెల్ఫీలు దిగి వారిని సంతోషపరిచారు.

# పాతబస్తీ మెట్రో వివరాలివ్వండి

**ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 6 (ఈవార్తలు): పాతబస్తీ అభివృద్ధికి మెట్రో రైలు నిర్మాణం ఎంతో కీలకమని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. అయితే, నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాతబస్తీ మెట్రో నిర్మాణం విషయంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈరోజు హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో నిర్మాణాల వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని, పురావస్తు శాఖ అనుమతులు తీసుకోలేదని పిటిషన్ దాఖలైంది. చారిత్రక కట్టడాలకు సమీపంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరపున ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. పాతబస్తీ అభివృద్ధికి మెట్రో రైలు చాలా కీలకమని కోర్టుకు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు రెండో దశ మెట్రో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాతబస్తీలో అభివృద్ధిని అడ్డుకోవడానికే ఈ పిటిషన్ దాఖలు చేశారని ఆయన అన్నారు. ఇరువైపుల వాదనలను విన్న న్యాయస్థానం నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని ప్రభుత్వానికి సూచించింది. నిర్దేశిత చారిత్రక కట్టడాల వద్ద మెట్రో నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది.



# కొండగట్టు మొక్కులు పిరం

## భారీగా పెరిగిన ఆర్జిత సేవా టికెట్ ధరలు.. చందనపూజ టికెట్‌కు రూ.1,500

**అంతరాలయ దర్శనం 400 నుంచి 800కు**

**శాశ్వత అభిషేకానికి ఏకంగా 10 వేలు**

**నవంబర్ 15 నుంచి అమల్లోకి కొత్త ధరలు**

**భక్తులపై భారం మోపొద్దు: బీజేపీ**

మల్యాల/జగిత్యాల బ్యూరో, నవంబర్ 6 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో పలు రకాల ఆర్జిత సేవల టికెట్ ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలను ఒకేసారి డబుల్ చేశారు. పెరిగిన ధరలు ఈ నెల అనగా నవంబర్ 15 నుంచి అమల్లోకి వస్తాయని ఈవో శ్రీకాంత్ తెలిపారు. చందన పూజ టికెట్ ధర గతంలో రూ.800 ఉండగా.. ఇప్పుడు దాన్ని ఏకంగా 1500 రూపాయలకు పెంచారు. అలానే రూ.400 ఉన్న అంతరాలయ దర్శనం టికెట్ ధరను రెట్టింపు చేశారు. అంటే 400 నుంచి రూ.800లకు పెంచారు.అలానే ప్రస్తుతం శాశ్వత అభిషేకం టికెట్ ధర రూ. 1,116 ఉండగా.. దాన్ని ఏకంగా ఒకేసారి రూ. 10 వేలకు పెంచారు. ఇదేకాక ఆలయంలో కొత్తగా అనేక రకాల ఆర్జిత సేవలు ప్రవేశపెట్టినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం సుప్రభాత సేవ సమయంలో.. స్వామి వారిని దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక దర్శన టికెట్ రూ.1000 తీసుకొచ్చారు. శని గ్రహ పీడ నివారణ పూజ టికెట్ ధరను రూ.1000గా నిర్ణయించారు. మన్యసూక్త హోమం కోసం రూ.2000, వడమాల టికెట్‌ను రూ.1,116గా నిర్ణయించారు. పెరిగిన వివిధ దర్శన, పూజా టికెట్ ధరలు నవంబర్ 15 నుంచి అమల్లోకి వస్తాయి ఈవో తెలిపారు. అలాగే ఆలయానికి కొత్తగా పీఆర్‌వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. గుడికి చెందిన 11 ఎకరాల భూమిని చదును చేసి లీజుకు ఇస్తామన్నారు. మూలవిరాట్టుకు 60 సంవత్సరాల నుంచి చందనం తొలగించలేదని, దేవాదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే చందనం తొలగింపు కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఆ తర్వాత బేతాళునికి చందనోత్సవం నిర్వహిస్తామన్నారు.



### పూజల పేరుతో భారం మోపొద్దు: బీజేపీ

ఆర్జిత సేవల ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ధరలను పెంచవద్దని బీజేపీ నాయకులు కోరారు. మల్యాల మండల పార్టీ అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలోని బృందం గురువారం కొండగట్టు సూపరిండెంట్ సునీల్ రావు, హరినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. 'భక్తులకు కొండగట్టులో మూత్రశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేయాలి. కోనేటిలో కనీసం వారానికి ఒకసారైనా నీటిని విడుదల చేసే ప్రయత్నం చేయాలి. కొండగట్టు అభివృద్ధి కోసం చేసే ప్రతి పనికి సహకరిస్తున్నాం. కాకపోతే హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ధరలు పెంచవద్దు. లేకపోతే బీజేపీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం' అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగని రవి, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బొట్ల ప్రసాద్, కోన శ్రీనివాస్, మల్లేశం యాదవ్, గౌతమ్, బండారి రాజు, నీలం రవి, నక్కా ఆనందం, రాఘవేంద్ర, జిల్లాల రమేష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## పోలీసులు న్యాయం చేస్తలేరని ఆత్మహత్యాయత్నం

మల్యాల, నవంబర్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. నూకపల్లి డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన యువకుడు మహ్మద్ అఖిల్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకునేందుకు యత్నించాడు. వివరాల్లోకెళితే.. మహ్మద్ అఖిల్ తల్లి అన్వర్ బేగం ఇటీవల ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని గత కొన్ని రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. అయినా, తనకు న్యాయం జరగడం లేదని గురువారం స్టేషన్ ప్రహరీ గోడ ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. వెంటనే పోలీసులు, స్థానికులు అతడిని నిలువరించారు. అతడిని కిందికి దించి ఆసుపత్రికి తరలించారు.

## యూట్యూబ్ పాట ఆదాయం ఇవ్వట్లేదని..

జగిత్యాల టౌన్, నవంబర్ 6 (ఈవార్తలు): యూట్యూబ్ పాట ద్వారా వచ్చే ఆదాయం తనకు ఇవ్వట్లేదని ఆ యూట్యూబ్‌కు సంబంధించిన పార్టనర్ జగిత్యాల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడో వ్యక్తి. వివరాల్లోకెళితే.. .. పట్టణంలో స్థానికంగా నివసిస్తున్న కుసుంబ మధు అలియాస్ వివాన్, మచ్చ సాగర్ కలిసి గత సంవత్సరం "వెన్నెల ఈడు చూసి జాను" అనే పాటను రూపొందించారు. ఇద్దరు షేరింగ్ పద్ధతిలో అగ్రిమెంట్ చేసుకొని ఆ ప్రకారం.. పాటను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. వచ్చే ఆదాయాన్ని పంచుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. అయినా యూట్యూబ్‌లో పాటకు వచ్చే ఆదాయాన్ని మధుకు ఇవ్వకుండా మచ్చ సాగర్ అనే వ్యక్తి జలేందర్, కళ్యాణి సహాయంతో పాటకు సంబంధించిన యాక్సెస్ పాస్వార్డ్ మార్చి మొత్తం ఆదాయాన్ని స్వంత ఖాతాలోకి మళ్లించుకున్నారని మధు ఆరోపించాడు. యూట్యూబ్ పాస్‌వర్డ్ తిరిగి ఇవ్వాలని కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో మధు, జగిత్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

## విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ కన్నుమూత

గన్నవరం, నవంబర్ 6 (ఈవార్తలు): విజయ డెయిరీ మాజీ ఛైర్మన్, పాడి రైతుల సంక్షేమ సారథి మండవ జానకిరామయ్య (93) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, గన్నవరం సమీపంలోని రుషి వాటిక వృద్ధాశ్రమంలో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. పాడి పరిశ్రమకు, ముఖ్యంగా విజయ డెయిరీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. సుమారు 27 సంవత్సరాల పాటు విజయ డెయిరీ ఛైర్మన్‌గా మండవ జానకిరామయ్య సుదీర్ఘకాలం సేవలందించారు. తన పదవీకాలంలో పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేశారు. రైతుల నుంచి పాలు సేకరించడం నుంచి వారికి గిట్టుబాటు ధర కల్పించడం వరకు అనేక సంస్కరణలు చేపట్టి, వారి ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఆయన నాయకత్వంలో విజయ డెయిరీ అభివృద్ధి పథంలో పయనించింది. మండవ జానకిరామయ్యకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలను ఈ సాయంత్రం ఆయన స్వగ్రామమైన మొవ్వలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. జానకిరామయ్య మృతి పట్ల పలువురు రాజకీయ, సహకార రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ టెక్స్‌టైల్ రంగంలోకి 9 కంపెనీలు

**విశాఖ సదస్సులో ఎంవోయూలు**

**రాయలసీమలో పరిశ్రమల ఏర్పాటుకు సంస్థల ఆసక్తి**

వైజాగ్, నవంబర్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జౌళి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు 9 కంపెనీలు ముందుకొచ్చాయని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న పార్టనర్‌షిప్ సదస్సులో ఈ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకోనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నిన్న రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయా కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కొందరు ప్రతినిధులు నేరుగా పాల్గొనగా, మరో ఐదుగురు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మ్యాట్రెస్ మాన్యుఫ్యాక్చరింగ్, అపెరల్ ప్రొడక్షన్, గార్మెంట్స్ తయారీ, పాలిస్టర్ వేడింగ్ వంటి యూనిట్ల ఏర్పాటుకు ఈ సంస్థలు ఆసక్తి చూపినట్లు మంత్రి సవిత ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా, ఈ కంపెనీలు తమ పరిశ్రమలను రాయలసీమ ప్రాంతంలో స్థాపించడానికి సుముఖత వ్యక్తం చేశాయని ఆమె పేర్కొన్నారు. ఏయే ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే అంశంపై విశాఖ సదస్సులో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన టెక్స్‌టైల్ పాలసీకి పారిశ్రామికవేత్తల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి సవిత అన్నారు. ఈ పాలసీ వల్లే పలువురు పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని కంపెనీలు రాష్ట్రంలో తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన నలుగురు పెట్టుబడిదారులను మంత్రి సవిత ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

## 21న తిరుమలకు రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ నెల 21న ఆమె స్వామివారి సేవలో పాల్గొంటారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆమె తిరుపతికి రానున్నారు. పర్యటనలో భాగంగా ఈ నెల 20న రాష్ట్రపతి ముందుగా తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడి నుంచి తిరుమలకు చేరుకుంటారు. మరుసటి రోజు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి మొదట శ్రీ వరాహస్వామి వారిని, ఆ తర్వాత శ్రీవారిని దర్శించుకుంటారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం తిరుమలలోని పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీవీఎస్వో మురళీకృష్ణతో పాటు ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

'వన్ విజన్-వన్ డైరెక్షన్' ప్రభుత్వ విధానమని, దీనికి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ దిశగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలు విజన్ యూనిట్లుగా పనిచేయాలని నిర్దేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో డేటా ఆధారిత పాలనపై ముఖ్యమంత్రి నేతృత్వంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఈ సదస్సుకు హాజరయ్యారు. డేటా ఆధారంగా పాలన ఏ విధంగా చేపట్టాలి? సత్వర నిర్ణయాలు ఏ విధంగా తీసుకోవచ్చు? డేటా ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు ఏ విధంగా అందించవచ్చనే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.




# 1 విజన్ 1 డైరెక్షన్

## ఇదే మా ప్రభుత్వ విధానం

- పౌర సేవలకు రేటింగ్‌లు ఇస్తాం
- కలిసి పని చేద్దాం... కలిసి విజయం సాధిద్దాం
- సాంకేతికతను వినియోగిస్తే ఖర్చులూ తగ్గించొచ్చు
- ఫైళ్ల క్లియరెన్సులో జాప్యం చేయొద్దు
- డేటా ఆధారిత పాలనపై సదస్సులో ఏపీ సీఎం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించాం. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నాను. నెలవారీ, త్రైమాసికాల వారీగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలి. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉంది.

అమరావతి, నవంబర్ 6 (ఈవార్తలు): ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత కావాలి. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్ధవంతంగా ఆ విభాగాన్ని వినియోగించుకోవాలి. ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో టెక్నాలజీ వినియోగించుకుని అంతా కలిసి కట్టుగా పని చేశాం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం"అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోంది. సిటిజన్ డేటా అంతా క్రోడీకరించాం. అంగన్‌వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలి. అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు డేటా లేక్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీని ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం ఒక్క చోటే క్రోడీకరించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. ఈ డేటా ద్వారా రియల్ టైమ్‌లోనే విశ్లేషించి తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ముందుగా అంచనాలు వేయడం, దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం అనేది సాంకేతికత ద్వారా సాధ్యం అవుతోంది. ప్రజల సంక్షేమం కోసం, పాలన కోసం భారీస్థాయిలో బడ్జెట్ వ్యయం చేస్తున్నాం. నిధుల వ్యయం సమర్ధంగా జరగాలి. ప్రస్తుతం ఇ-ఫైల్స్ కూడా అందరికీ అందుబాటులో ఉన్నాయి. అయితే ఎంత వేగంగా నిర్ణయం తీసుకుంటున్నారన్నదే ప్రస్తుతం ఉత్పన్నం అవుతున్న ప్రశ్న. గతంలో ఒక్క చదువుకే కులం, స్థానికత, ఆదాయం ఇలా వేర్వేరు ధృవపత్రాలు 10 రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వచ్చేది. ఈ పరిస్థితి అంతా మారిపోవాలి. కేంద్రం తీసుకొచ్చిన డిజి లాకర్‌ను సమర్ధంగా వినియోగించాలి. అందరూ అన్ని శాఖలలోని సమాచారాన్ని తెలుసుకుని దానిని గుర్తించి పనిచేయాలి. ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తున్నప్పుడు మళ్లీ ప్రజల్ని కార్యాలయాలకు రప్పించటం ఎందుకన్నది ఆలోచించాలి. దేవాదాయశాఖ అందిస్తున్న సేవల విషయంలో భక్తులు అంతా క్షేత్రస్థాయికి వస్తారు.

"నీటి వనరుల విషయంలోనూ రియల్ టైమ్‌లోనే నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. రీఛార్జి చేయటంతో పాటు భూగర్భజలాలను పెంచుకుంటే కరవు అనే పరిస్థితే ఉండదు. ఉచిత విద్యుత్ నిమిత్తం రైతులకు రూ.9 వేల కోట్ల సబ్సిడీ ఇస్తున్నాం. భూగర్భజలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గి రూ.4500 కోట్ల వ్యయం తగ్గించుకోవచ్చు. అలాగే వైద్యారోగ్య శాఖలోనూ వనరుల సమర్థ నిర్వహణ ద్వారా ప్రిడిక్టివ్ అనాలసిస్ ద్వారా వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంది. అప్పుడు డేటానే మనకు అద్భుతమైన సంపదగా మారుతుంది. భూ సంబంధిత వ్యవహారాల్లో లిటిగేషన్లు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం కోర్టుకు వెళ్లే పరిస్థితులు వస్తున్నాయి. ఏఐ వాడితే జీవోల ద్వారా లిటిగేషన్లు రాకుండా నివారించవచ్చు. బాధ్యతగా పనిచేస్తూ ముందుకెళ్దాం. సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించండి.

రిజిస్ట్రేషన్ విభాగంలో సేవల సంతృప్తి స్థాయి **62-70** శాతానికి చేరింది. రెవెన్యూ లాంటి ప్రభుత్వ శాఖలు చేపట్టిన వివిధ కార్యక్రమాలు గడువు మేరకు పూర్తి కావాలి. ఆన్‌లైన్, వాట్సాప్ సేవలు, పీపుల్స్ టచ్ అనే అంశాలను దృష్టిలో పెట్టుకుని పని చేయాలి. ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే మన లక్ష్యం. ఫైళ్ల క్లియరెన్సు విషయంలో ఇంకా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫైళ్ల క్లియరెన్సు కోసం రోజుల సమయాన్ని తీసుకోవటం సరికాదు. కొందరు మంత్రుల పనితీరు బాగా మెరుగుపర్చుకోవాలి. ఫైళ్లు క్లియర్ చేయటంలో ఆలస్యం జరగకూడదు. ప్రభుత్వ శాఖలు అందించే సేవలకు రేటింగ్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నాం" అని చంద్రబాబు చెప్పారు.

### మొంథా తుపానులో పని చేసిన విధంగానే..

మొంథా తుపానులో పని చేసిన విధంగానే పరిపాలనలోనూ పనిచేయాలి. మొంథా తుఫాన్ సందర్భంగా కన్పించిన టీం స్పిరిట్ అన్ని చోట్లా కన్పించాలి. ఇదో మోడల్‌గా తీసుకుని కలసి పనిచేద్దాం. టెక్నాలజీ అందు బాటులోకి వచ్చాక కూడా పనితీరు మెరుగుపర్చుకోకపోతే అది నిర్లక్ష్యమే. రాష్ట్ర అభివృద్ధి, విజన్ లక్ష్యాల సాధనలో అన్ని శాఖలూ సమన్వయంగా పనిచేయాలి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలి. సామాజిక, శాంతిభద్రతల ఇండికేటర్లు కూడా విశ్లేషించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ప్రజలకు అందే సేవల విషయంలో కాంట్రాక్టర్లకు సర్వీస్ స్టాండర్డ్స్ ఫిక్స్ చేయాల్సిందే. ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకోకుండా మౌన ప్రేక్షకుడిలా మిగిలిపోతే సమాజానికి అన్యాయం చేస్తున్నట్టే"అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అధికారులు సాంకేతికతను తమ తమ శాఖల్లో ఏ విధంగా ఉపయోగిస్తున్నామనే విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. సాంకేతికతను వినియోగించుకుని విశ్లేషణలు చేసుకోవడం ద్వారా జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయని అధికారులు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఎగవేతలు లేకుండా పర్యవేక్షణ చేస్తున్నామని వెల్లడించారు. ఇక ఈ-వేబిల్స్ ద్వారా ఎక్కడా ఎగవేతలు లేకుండా చూస్తున్నామని, రెవెన్యూ నష్టం లేకుండా సీసీ కెమెరాలు వినియోగిస్తున్నామని చెప్పారు. గడచిన 25 రోజులుగా సురక్షా యాప్ స్కాన్ చేస్తూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఇప్పటి వరకూ ఒక్క నకిలీ బాటిల్ కూడా లభ్యం కాలేదని చెప్పారు. మద్యం కొనుగోళ్లు చేసే సమయంలో యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలనే అంశాన్ని మరింతగా ప్రచారం చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### రెవెన్యూ సేవలు వీలైనన్ని ఆన్ లైన్ లేదా, వాట్సప్ గవర్నెన్స్ ద్వారానే..

రెవెన్యూ సహా ఇతర శాఖల సేవలు వీలైనన్ని ఆన్ లైన్ లేదా, వాట్సప్ గవర్నెన్స్ ద్వారానే అందాలి. ఆఫీసుల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉండకూడదు. అన్ని జిల్లాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాలు ఏర్పాటు అవుతాయి. ఏఐ సాయంతో పాత సమాచారాన్ని, ప్రస్తుతం ఉత్పన్నం అయ్యే సమాచారాన్ని సరిచూసుకోవాలి. ప్రజలకు అందే ప్రతీ సేవలోనూ ప్రమాణాల్ని నెలకొల్పాల్సి ఉంది. అలాగే ప్రజల నుంచి అందే ఫిర్యాదుల విషయంలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నా. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు సరిగ్గా వ్యవహరించాలి. ఆర్థికేతర, చట్టపరమైన ఫిర్యాదుల విషయంలో ఆలస్యం జరగటం సరికాదు. ఈ పరిస్థితి మారాలి. అలాగే జరుగుతున్న పరిణామాలు ఆధారంగా ఎప్పటికప్పుడు అలెర్ట్ అవ్వాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగినప్పుడు వాటికి గల కారణాలను విశ్లేషించి భవిష్యత్తులో అలాంటివి జరగ్గకుండా చూసుకోవాలి. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాల వల్ల చాలా ప్రాణాలు పోయాయి. కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఒక సంఘటన తర్వాత ఆయా తప్పులు దిద్దుకోవాల్సి ఉంది. ఆ మేరకు ప్రామాణికాలు రూపొందించుకుని అటువంటి తప్పిదాలు మళ్లీ జరగ్గకుండా చూసుకోవాలి. ఇన్సిడెంట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఘటనలు జరక్కుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది" అని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలకుల వల్ల 22ఏ లాంటి వివాదాలు పెద్ద ఎత్తున తలెత్తాయి. రికార్డులు కూడా తారుమారు చేశారు. వాటిని పరిష్కరించే విషయంలో యంత్రాంగం అత్యంత భాధ్యతగా వ్యవహరించాలి. అలాగే ఎక్సైజ్ శాఖలోనూ గత ప్రభుత్వంలో తీవ్రమైన అవకతవకలు జరిగాయి. వాటన్నిటినీ సరిచేస్తుంటే మళ్లీ మనపై ఆరోపణలు గుప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు.

# టీ మా కొంప ముంచింది

## పాకిస్థాన్ ఉప ప్రధాని కీలక వ్యాఖ్యలు





ఇస్లామాబాద్: తాలిబన్లు ఇచ్చిన ఒక కప్పు టీ తమ కొంప ముంచిందని పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇస్సాక్‌దార్ అన్నారు. పాకిస్థాన్–ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఎస్ఐ మాజీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఫయాజ్ హమీద్ ఆఫ్ఘనిస్థాన్ పర్యటనను ఉద్దేశించి ఆయన విమర్శలు చేశారు. 2021లో తాలిబన్లు ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చి అధికారం హస్తగతం చేసుకున్నారు. అదే ఏడాది హమీద్ ఆ దేశంలో పర్యటించారు. ఆ పర్యటనకు సంబంధించిన వీడియోలో ఒక సమావేశంలో ఆయన టీ తాగుతూ కనిపించారు. అంతా బాగుంటుందని తాలిబన్ పాలకులకు భరోసా ఇచ్చారు. అయితే, ఆ కప్పు టీ తమకు ఎంతో నష్టాన్ని కలిగించిందని ఇస్సాక్‌దార్ తాజాగా విమర్శలు గుప్పించారు. ఆ టీ తర్వాత తాము మా సరిహద్దులను తెరిచామని, దీంతో 40 వేల మంది వరకు తాలిబన్లు చొరబడ్డారని, ఆ భేటీ తర్వాత పాకిస్థాన్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వం కరుడుగట్టిన నేరస్థులను కూడా విడుదల చేసిందని ఆరోపించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో హమీద్ పర్యటన తర్వాత మిలిటెంట్లకు దారులు తెరుచుకున్నాయని, ఆ తర్వాత తమ దేశంలో ఉగ్రవాదాన్ని రగిల్చిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా తీసుకునే నిర్ణయాలపై నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పుడు నాడు పాకిస్థాన్‌లో అధికారంలో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం స్వాగతించింది. కానీ ఇప్పుడు రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఈ ఘర్షణ వాతావరణానికి ముగింపు పలికేందుకు చర్చలు జరుగుతున్నాయి.

# భారత్-పాక్ శాంతి నా వల్లే

**ట్రంప్ నోట మళ్లీ అదే పాట**

న్యూయార్క్: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, తనవల్లే ఇరు దేశాల మధ్య శాంతి నెలకొందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడంతోనే అణుశక్తి దేశాలైన భారత్, పాక్‌లు వెనక్కి తగ్గాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆ ఘర్షణలో కూల్చేసిన ఫైటర్ జెట్ల సంఖ్య ఏడు కాదని, ఎనిమిది అని కొత్త లెక్క చెప్పారు. బుధవారం మయామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడయ్యాక ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది ఘర్షణలను ఆపేశానని, అందులో భారత్–పాక్ వివాదం కూడా ఒకటని ట్రంప్ చెప్పుకొచ్చారు. "నేను భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నాను. అదే సమయంలో వారు యుద్ధానికి సిద్ధమవుతున్నారని ఓ పత్రికలో చదివాను. ఏడు విమానాలు కూల్చివేశారని, ఎనిమిదోది తీవ్రంగా దెబ్బతిందని తెలిసింది. అంటే దాదాపు 8



విమానాలు కూలిపోయాయి. ఇది యుద్ధమే అని గ్రహించాను. మీరు శాంతికి అంగీకరించకపోతే మీతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోబోనని ఇరు దేశాలకు స్పష్టం చేశాను" అని ట్రంప్ వివరించారు. తమ దేశాల వివాదానికి, వాణిజ్యానికి సంబంధం లేదని తొలుత ఇరు దేశాలు వాదించాయని ట్రంప్ తెలిపారు. "మీవి అణ్వస్త్ర దేశాలు. ఒకరితో ఒకరు యుద్ధం చేసుకుంటే మీతో నేను వ్యాపారం చేయను అని కరాఖండిగా చెప్పాను. ఆ మరుసటి రోజే ఇరు దేశాలు శాంతికి అంగీకరించాయని నాకు ఫోన్ వచ్చింది. అప్పుడు నేను 'థాంక్యూ, ఇప్పుడు వ్యాపారం చేద్దాం' అన్నాను. ఇదంతా సుంకాల వల్లే సాధ్యమైంది" అని ట్రంప్ చెప్పగానే సభికులు హర్షధ్వానాలు చేశారు. అయితే, ట్రంప్ వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వం వహించలేదని స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మంది పౌరులను చంపినందుకు ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని గుర్తుచేసింది. మే 7న పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశామని, నాలుగు రోజుల పాటు జరిగిన దాడుల తర్వాత పాకిస్థాన్ కమాండర్లే కాల్పుల విరమణ కోసం భారత అధికారులను వేడుకున్నారని తెలిపింది. మే 10న కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని వెల్లడించింది. గతంలో కూడా ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. మే నెలలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ఆయన పదేపదే చెబుతున్నారు. నివేదికల ప్రకారం, ఇప్పటివరకు ట్రంప్ ఈ విషయాన్ని సుమారు 60 సార్లు ప్రస్తావించగా, ప్రతిసారీ భారత్ ఆయన వాదనను తోసిపుచ్చుతూ వస్తోంది.

# యువతకు మోదీ 'డేటా' మత్తు

## సోషల్ మీడియా '21వ శతాబ్దపు మత్తు'.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**ఓట్ల దొంగతనాన్ని ప్రతిఘటించాలని పిలుపు**



పాట్నా: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ యువతకు ఉద్యోగాలు కల్పించకుండా, వారికి చౌకగా డేటా అందించి సోషల్ మీడియాకు బానిసలను చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీన్ని '21వ శతాబ్దపు మత్తు'గా ఆయన అభివర్ణించారు. గురువారం బీహార్‌లోని పూర్ణియాలో జరిగిన భారీ బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "మీ ప్రధానమంత్రి ఇక్కడికి వచ్చి మీకు 21వ శతాబ్దపు మత్తును ఇచ్చారని చెప్పారు. గతంలో మద్యం లేదా డ్రగ్స్‌తో జరిగే పని, ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో జరుగుతోంది. యువత 24 గంటలూ రీల్స్ చూస్తూనే ఉన్నారు" అని అన్నారు. సభకు హాజరైన వారిని ఉద్దేశించి, "ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో మీ జేబుల్లోకి ఎంత డబ్బు వచ్చింది? మీకు ఉద్యోగాలు కావాలా? లేక ఇన్‌స్టాగ్రామ్ కావాలా?" అని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ భారత యువత ఉపాధిని లాక్కొని, దాన్ని చైనా యువతకు అప్పగించారని రాహుల్ ఆరోపించారు. "ఆయన మీ ఉపాధిని తీసివేసి చైనాకు ఇచ్చానని మీకు చెప్పరు. బీహార్ యువతను కార్మికులుగా మార్చేశారు" అని విమర్శించారు. మోదీ ప్రభుత్వంలో బీహార్ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని, అదే సమయంలో కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలు మాత్రమే లబ్ధి పొందుతున్నారని ధ్వజమెత్తారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్ పై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. ఆయన "రిమోట్ కంట్రోల్" ప్రధాని మోదీ చేతిలో ఉందని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఓట్ల దొంగతనాన్ని ప్రతిఘటించాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని" యువ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, విశ్వవిద్యాలయాల నిర్మాణం, ప్రపంచ స్థాయి నలందా విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి బీహార్ విద్యా వైభవాన్ని తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. "మేము మీ జేబుల్లో డబ్బు పెట్టాలనుకుంటున్నాం, బిలియనీర్ల జేబుల్లో కాదు" అని రాహుల్ స్పష్టం చేశారు. తమ మహాఘట్‌బంధన్ ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల కోసం పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

# మిగతావన్నీ 'ధోకా' అని ఎలా అంటారు?

**పతంజలి యాడ్‌పై ఢిల్లీ హైకోర్టు సీరియస్**

**పతంజలి చ్యవన్‌ప్రాశ్ ప్రకటనపై**

**ఢిల్లీ హైకోర్టులో విచారణ**

**మిగతా బ్రాండ్లను 'ధోకా'**

**అనడంపై కోర్టు అభ్యంతరం**




న్యూఢిల్లీ: ప్రముఖ యోగా గురు రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. తమ చ్యవన్‌ప్రాశ్ మాత్రమే అసలైనదని, మార్కెట్‌లోని ఇతర కంపెనీల ఉత్పత్తులన్నీ 'ధోకా' (మోసం) అని ప్రచారం చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రముఖ ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ డాబర్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పతంజలి ప్రకటనపై డాబర్ ఇండియా మధ్యంతర ఉత్తర్వులు కోరగా, జస్టిస్ తేజస్ కరియా ఈ కేసును విచారించారు. "మీరు మీ ఉత్పత్తి ఉత్తమమైనదని చెప్పుకోవచ్చు. కానీ, ఇతరులందరినీ మోసగాళ్లు అని ఎలా అంటారు? 'ధోకా' అనేది చాలా ప్రతికూలమైన, అవమానకరమైన పదం. ప్రజలు మోసపూరితమైన పదార్థాన్ని తింటున్నారని మీరు చెప్పినట్లు అవుతుంది. నిఘంటువులో 'ధోకా' కాకుండా వాడటానికి మరో పదం లేదా?" అని పతంజలిని న్యాయమూర్తి సూటిగా ప్రశ్నించారు. డాబర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సందీప్ సేథీ... పతంజలి ప్రకటన అన్ని చ్యవన్‌ప్రాశ్ బ్రాండ్లను కించపరిచేలా ఉందని ఆరోపించారు. "ఒక యోగా గురు నుంచి ఇలాంటి మాటలు రావడం మరింత తీవ్రమైన విషయం. ఎందుకంటే ప్రజలు ఆయన మాటల్లో నిజాయితీ ఉంటుందని నమ్ముతారు. మాది 100 ఏళ్ల చరిత్ర ఉన్న సంస్థ. మార్కెట్‌లో 61 శాతం వాటా ఉంది. ఈ ప్రకటన కేవలం ఐదు రోజుల్లో 9 కోట్ల వ్యూస్ సంపాదించింది. ఇది ప్రజల్లో అనవసర ఆందోళన కలిగిస్తోంది" అని కోర్టుకు వివరించారు. పతంజలి తరఫున సీనియర్ న్యాయవాది రాజీవ్ నయ్యర్ వాదిస్తూ... తమ ప్రకటన కేవలం అతిశయోక్తి మాత్రమేనని, చట్టప్రకారం ఇది అనుమతించదగినదేనని తెలిపారు. "మేము ఇతరుల ఉత్పత్తులు పనిచేయవని చెప్పడం లేదు. మాది అన్నింటికంటే ఉత్తమమైనదని చెప్పడమే మా ఉద్దేశం. డాబర్ ఈ విషయంలో అనవసరంగా అతిగా స్పందిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. తమ చ్యవన్‌ప్రాశ్‌లో "51 ఆయుర్వేద మూలికలు, కుంకుమపువ్వు" ఉన్నాయని పతంజలి తప్పుడు ప్రచారం చేస్తోందని, ఇది 2014 ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని కూడా డాబర్ తన పిటిషన్‌లో ఆరోపించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

# జమ్మూ నుంచి శ్రీనగర్‌కు డైరెక్ట్ రైలు

**ఈ ఏడాది చివరికల్లా జమ్మూ-శ్రీనగర్ మధ్య ప్రత్యక్ష రైలు సర్వీసు**



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ రైల్వే కనెక్టివిటీలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఈ ఏడాది చివరి నాటికి జమ్మూ నుంచి శ్రీనగర్‌కు నేరుగా రైలు సర్వీసు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన పనులను ఈ నెల 30 లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు భారత రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ సర్వీసు అందుబాటులోకి వస్తే, దేశంలోని ఇతర ప్రాంతాలతో కశ్మీర్ లోయకు రైలు మార్గం ద్వారా ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. ప్రస్తుతం రియాసి జిల్లాలోని కాత్రా పట్టణం నుంచి కశ్మీర్‌కు వందే భారత్ రైలు నడుస్తోంది. అయితే, జమ్మూ నుంచి నేరుగా శ్రీనగర్‌కు రైలును నడపాలనే లక్ష్యంతో నార్తర్న్ రైల్వే పనులను వేగవంతం చేసింది. జమ్మూ డివిజన్‌లో ఆపరేషనల్, పునరాభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. గతంలో ఆకస్మిక వరదల కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే ఇప్పుడు ప్రాజెక్టును అత్యంత వేగంగా ముందుకు తీసుకెళు -న్నామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా జమ్మూ–కాత్రా మార్గంలో బ్రిడ్జిలు, ట్రాక్‌లు, స్టేషన్ల పునరాభివృద్ధి పనులు సవాలుగా మారాయి. "జమ్మూ స్టేషన్‌లో సివిల్ నిర్మాణాలు, ట్రాక్‌కు సంబంధించిన పనులు రెండు కేటగిరీలుగా జరుగుతున్నాయి. ట్రాక్ పనులు దాదాపు పూర్తయ్యాయి. కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, స్టేషన్ సౌకర్యాలతో సహా సివిల్ నిర్మాణాలు కూడా పూర్తికావొచ్చాయి. జమ్మూ–శ్రీనగర్ కనెక్టివిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేందుకు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం" అని ఓ అధికారి వివరించారు. నవంబర్ చివరి నాటికి అన్ని పనులు పూర్తయిన తర్వాత, డైరెక్ట్ రైలు సర్వీసు ప్రారంభంపై తుది నిర్ణయం తీసుకుంటారు. భారత రైల్వే చేపట్టిన అత్యంత సవాలుతో కూడిన ప్రాజెక్టులలో ఉదంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ఒకటి. హిమాలయాల గుండా సాగే ఈ ప్రాజెక్టులో అనేక ఇంజినీరింగ్ అద్భుతాలు ఉన్నాయి. చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన, అంజి ఖద్ నదిపై నిర్మించిన దేశంలోనే తొలి కేబుల్ ఆధారిత రైల్వే బ్రిడ్జి ఈ మార్గంలోనే ఉన్నాయి. ఈ లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో, ఈ ప్రాంతంలో సామాజిక–ఆర్థిక అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. జూన్ 6న ప్రధాని నరేంద్ర మోదీ కాత్రా నుంచి శ్రీనగర్‌కు తొలి వందే భారత్ రైలును ప్రారంభించి శతాబ్దపు కలను సాకారం చేసిన విషయం తెలిసిందే.

# బురఖా ఓటర్లను తనిఖీ చేయాల్సిందే

పాట్నా: కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత గిరిరాజ్ సింగ్ మరోసారి తన వ్యాఖ్యలతో రాజకీయ దుమారం రేపారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బురఖా ధరించిన ఓటర్లను తనిఖీ చేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దొంగ ఓట్లను అరికట్టేందుకే ఈ చర్యలు అవసరమని ఆయన వాదించారు. బేగూసరాయ్ ఎంపీ అయిన గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ "అనుమానాస్పదంగా కనిపించే బురఖా ధరించిన ఓటర్లను కచ్చితంగా తనిఖీ చేస్తాం. దీని కోసం మా వాళ్లు నిఘా పెడతారు" అని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా, "ఇది బీహార్.. పాకిస్థాన్ కాదు. ఇక్కడ షరియా చట్టాన్ని అమలు చేయడానికి వీల్లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం బీహార్ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. గిరిరాజ్ సింగ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన అనేక ఎన్నికల సమయంలోనూ ఆయన ఇలాంటి మతపరమైన వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. ప్రతిసారీ ఆయన వ్యాఖ్యలపై విపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతంలో ఆయన వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు కూడా అందాయి. ప్రస్తుత వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సమయంలో ఆయన చేసే ఇలాంటి వ్యాఖ్యలు బీహార్‌లో తరచూ ఉద్రిక్తతలకు కారణమవుతుంటాయి.

# అమెరికా 80 వేల వీసాలు రద్దు

వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది జనవరి నుండి 80 వేలకు పైగా వీసాలను రద్దు చేశారు. ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. వీసాలు రద్దైన వారిలో హింస, చోరీ, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరిక వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. దీనిని శ్వేతసౌధం కూడా ధ్రువీకరించింది. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం అక్రమ వలసదారులను వెనక్కి పంపించే కార్యక్రమం చేపట్టారు. దీంతోపాటు సోషల్ మీడియా వెట్టింగ్‌తో పాటు స్క్రీనింగ్‌ను విస్తృతం చేశారు. స్థానిక చట్టాలను ఉల్లంఘించే వారి వీసాల రద్దును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వీసాల రద్దు భారీగా పెరిగినట్లు ఆ కథనం పేర్కొంది. రద్దైన వీసాలను పరిశీలిస్తే, మద్యం సేవించి వాహనం నడిపిన వారు 16 వేలు, దాడుల్లో ప్రమేయమున్న వారు 12 వేలు, చోరీ కేసుల్లో 8 వేల మంది ఉన్నట్లుగా సమాచారం. రద్దైన 80 వేల వీసాల్లో విద్యార్థి వీసాలు 8 వేలకు పైగా ఉన్నట్లు కథనం పేర్కొంది. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఒకే రైల్వే ట్రాక్‌పై మూడు రైళ్లు!

బిలాస్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఒకే ట్రాక్‌పై మూడు రైళ్లు రావడంతో అక్కడ ఉన్నవారంతా భయాందోళనలకు గురయ్యారు. కొన్ని రోజుల క్రితం ఇదే రాష్ట్రంలో గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొన్న ఘటనలో లోకోపైలట్‌తో సహా 11 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి రావటం కలవరపాటుకు గురిచేసింది. కోట్మి సోనార్, జైరాంనగర్ స్టేషన్ల మధ్య ఉన్న ట్రాక్‌పై ఒకేసారి రెండు గూడ్స్ రైళ్లు, ఒక ప్యాసింజర్ రైలు వచ్చాయి. అది గమనించిన ప్యాసింజర్ రైలు లోకో పైలట్ వెంటనే రైలును ఆపేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్యాసింజర్ రైలు కదులుతూ ఉండగా ఈ సంఘటన జరిగింది. ట్రాక్‌పై ప్యాసింజర్ రైలు ఉండగా, హఠాత్తుగా ముందు నుంచి ఒకటి, వెనుక నుంచి ఒకటి గూడ్స్ రైళ్లు ట్రాక్ పైకి వచ్చాయి. ఇది గమనించిన ప్యాసింజర్ రైలు ప్రయాణికులు భయానికి గురయ్యారు. లోకోపైలట్ అప్రమత్తమై రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# నవంబర్ విప్లవం ఉండదు

**కర్ణాటక సీఎం మార్పుపై డీకే**



బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మరోసారి స్పందించారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు వార్తలను ఆయన ఖండించారు. పార్టీ గీతను తాను ఎప్పుడూ దాటబోనని స్పష్టం చేశారు. 'నవంబర్ విప్లవం' ఉండదని ఆయన తేల్చి చెప్పారు. పార్టీకి ఎల్లప్పుడూ క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా ఉంటానని స్పష్టం చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య, డీ.కె. శివకుమార్ చెరో రెండున్నరేళ్లు పదవీ కాలాన్ని పంచుకుంటారనే ప్రచారం మొదటి నుంచి ఉంది. సిద్ధరామయ్య పదవీ కాలం రెండున్నరేళ్లు ముగియనుండటంతో డీ.కె. శివకుమార్ ముఖ్యమంత్రి పదవిపై దృష్టి సారించారనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆయన వర్గం నాయకులు కూడా ఆయన ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీ.కె. శివకుమార్ మాట్లాడుతూ, "నవంబర్ విప్లవం ఉండదు, డిసెంబర్ విప్లవం ఉండదు. జనవరి లేదా ఫిబ్రవరిలో కూడా ఏమీ ఉండదు. ఏ విప్లవం వచ్చినా 2028లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ విప్లవం అంటూ ఎవరో కారణం లేకుండా అలా మాట్లాడుతున్నారని అన్నారు. పార్టీ తమకు ఎన్నో బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. బీహార్ ఎన్నికల బాధ్యతలను కూడా అధిష్ఠానం తమకు అప్పగించిందని అన్నారు. ఇదితప్ప మరో ఇతర విప్లవం లేదని అన్నారు. తన ఢిల్లీ పర్యటనలో తాను ఎవరితోనూ మంత్రివర్గ విస్తరణ గురించి మాట్లాడలేదని అన్నారు. "నాయకత్వ మార్పు గురించి నేను ఏమైనా చెప్పానా? పార్టీ సూచించిన దారిలోనే నడుస్తాం. సిద్ధరామయ్య ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఢిల్లీ నాయకులు ఏం చెబితే అదే చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

# అనిల్ అంబానీకి మరోసారి ఈడీ నోటీసులు

ముంబై: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. బ్యాంకు మోసం కేసు, మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయనను వచ్చే వారం ఈడీ విచారించనుంది. ఈ మేరకు నవంబర్ 14న విచారణకు తమ కార్యాలయానికి హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. ఎస్బీఐ నుంచి తీసుకున్న రుణాల ఎగవేత, ఆ నిధుల తరలింపునకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ ప్రశ్నించనుంది. రూ. 17 వేల కోట్ల రుణ మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అనిల్ అంబానీని ఈ ఏడాది ఆగస్టులో ఈడీ విచారించింది. అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు ఈ మొత్తాన్ని అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ చర్యలు చేపట్టింది.

# రైల్లో భోజనం రేటుపై గొడవ

**రూ.20 కోసం ప్రయాణికుడిని చితకబాదిన సిబ్బంది**

లక్నో:ఉత్తరప్రదేశ్‌లో ఓ రైలులో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కేవలం రూ.20 అదనంగా వసూలు చేయడాన్ని ప్రశ్నించినందుకు ఓ ప్రయాణికుడిపై క్యాటరింగ్ సిబ్బంది కర్రలు, బెల్టులతో దాడి చేశారు. ఈ అమానవీయ సంఘటన ఝాన్సీ సమీపంలో అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిహాల్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి కత్రా నుంచి బినాకు అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లో వెజ్ మీల్స్ ఆర్డర్ చేశారు. దాని ధర రూ.110 ఉండగా, క్యాటరింగ్ సిబ్బంది ఆయన వద్ద రూ.130 వసూలు చేశారు. దీనిపై నిహాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ధర ఎందుకు ఎక్కువగా తీసుకుంటున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన క్యాటరింగ్ సిబ్బంది, నిహాల్‌పై దాడికి తెగబడ్డారు. కొందరు కర్రలు, మరికొందరు బెల్టులతో ఆయనను విచక్షణారహితంగా కొట్టారు. తోటి ప్రయాణికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా వారు లెక్కచేయకుండా దాడిని కొనసాగించారు. .

# లాటరీలో పావు కిలో బంగారం!

**దుబాయ్‌లో భారతీయుడికి జాక్‌పాట్**

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న ఓ ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. దుబాయ్‌లో నిర్వహించిన ప్రఖ్యాత 'బిగ్ టికెట్' ఈ–డ్రాలో ఏకంగా పావు కిలో బంగారం గెలుచుకున్నారు. దీంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కేరళకు చెందిన నితిన్ కున్నత్ రాజ్, ఉపాధి నిమిత్తం 2016 నుంచి దుబాయ్‌లో నివసిస్తున్నారు. ఇటీవల ఆయన తన స్నేహితులతో కలిసి కొనుగోలు చేసిన టికెట్‌కు ఈ జాక్‌పాట్ తగిలింది. డ్రా నిర్వాహకులు నితిన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా, ఆయన తొలుత నమ్మలేదు. ఎవరో సరదాకి చేస్తున్నారని భావించారు. అయితే, వారు టికెట్ నంబర్ 351853 సహా పూర్తి వివరాలు చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఈ డ్రాలో ఆయన 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 250 గ్రాముల బంగారు కడ్డీని గెలుచుకున్నారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ టికెట్‌ను తాను మరో 10 మంది స్నేహితులతో కలిసి వేర్వేరు పేర్లతో కొనుగోలు చేశానని నితిన్ తెలిపారు. గెలుచుకున్న ఈ బహుమతిని వారందరితో పంచుకుంటానని స్పష్టం చేశారు. తన జీవితంలో ఇలాంటి అదృష్టం వరించడం ఇదే మొదటిసారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## వయ్యారి చిత్రం



కృతి కర్బందా



# కాంత నా డ్రీమ్ ప్రాజెక్ట్

మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి వరుస హిట్‌లతో తెలుగులో దుల్కర్ సల్మాన్ తనకంటూ భారీ మార్కెట్‌ను క్రియేట్ చేసుకున్నారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న మరో ప్రతిష్టాత్మక చిత్రం 'కాంత'. పాతతరం సినిమా ఇండస్ట్రీ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడిక్ థ్రిల్లర్ డ్రామాగా ఈ సినిమా రాబోతోంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ట్రైలర్‌కు అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ ఈవెంట్‌లో సినిమా నిర్మాతల్లో ఒకరైన రానా దగ్గుబాటి, హీరో దుల్కర్ సల్మాన్ పాల్గొన్నారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ ప్రాజెక్ట్‌పై వారు ఎంతో కాన్ఫిడెంట్ గా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ సినిమాను నిర్మించడం తనకెంతో గర్వంగా ఉందని రానా పేర్కొన్నారు. ఇది తనకు ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఈవెంట్‌లో రానా చేసిన వ్యాఖ్యలు సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. రానా మాట్లాడుతూ.. "ఈ సినిమా విడుదలయ్యాక దుల్కర్ సల్మాన్‌ను అందరూ 'నట చక్రవర్తి' అని పిలుస్తారు" అని అన్నారు. 'కాంత' వంటి సినిమాను నిర్మించినందుకు గర్వపడుతున్నానని, ఇది తమ అందరి కెరీర్‌లో ఒక గొప్ప మూవీగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.



# శిల్ప దంపతుల చుట్టూ ఉచ్చు



బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. బిజినెస్ మ్యాన్ దీపక్ కొఠారి చేసిన కంప్లైంట్ మేరకు రూ.60 కోట్ల మోసం కేసులో శిల్పా దంపతులపై జుహు పోలీసులు ఆల్రెడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఇప్పుడు ఈ కేసులో దర్యాప్తు వేగం పెరిగింది. తాజా సమాచారం ప్రకారం నిధుల మళ్లింపు లో కీలక పాత్ర పోషించిన నలుగురు ఉద్యోగులను దర్యాప్తు అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఆ నలుగురూ శిల్పా- రాజ్ కంపెనీలో ఉన్నత స్థానాల్లో పని చేసే వారేనని, వారిలో ఒకరు ఆల్రెడీ విచారణకు కూడా హాజరయ్యారని ఈఓడబ్ల్యూ వెల్లడించింది. అధికారులు ఈ నలుగురికీ సమన్లు జారీ చేసి ప్రశ్నించనున్నట్టు సమాచారం. దాంతో పాటూ కంపెనీ లావాదేవీల పేరుతో రాజ్ కుంద్రా డబ్బును వేరే దారికి మళ్లించారా లేదా అనే విషయంపై కూడా అధికారులు విచారణ చేస్తున్నారట.

# కాంప్రమైజ్ కాలేకే..
## : రవీనా టాండన్

ఒకరు చేయాల్సిన సినిమాలు వారు వదులుకోవడం వల్లనో లేక మరే ఇతర కారణాల వల్లనో వేరే వారి చేతుల్లోకి వెళ్తాయి. అయితే ఆ విషయాలు కొన్ని సార్లు బయటకు వస్తే మరికొన్ని సార్లు మరుగున పడతాయి. ఇంకొన్ని సార్లు చాలా ఏళ్ల తర్వాత అనుకోకుండా ఆ విషయాలు బయట పడుతూ ఉంటాయి. ఇప్పుడలానే ఓ విషయాన్ని వెల్లడించారు బాలీవుడ్ నటి రవీనా టాండన్. హీరోయిన్ గా బాలీవుడ్ లో ఎన్నో సినిమాలు చేసిన రవీనా గతంలో తాను ఓ సూపర్ స్టార్ ఫిల్మ్ ను వదులుకున్నట్టు ఇన్నేళ్ల తర్వాత బయటపెట్టారు. ఆ సినిమానే డర్. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ యష్ చోప్రా దర్శకత్వంలో 1993లో వచ్చిన డర్ సినిమాలో సన్నీ డియోల్, షారుఖ్ ఖాన్ గా నటించగా, ఆ సినిమా కోసం మేకర్స్ ముందుగా తననే సంప్రదించారని చెప్పారు రవీనా. ఆ సినిమాలోని కొన్ని సీన్స్ నచ్చకపోవడం మరియు మూవీలో స్విమ్ సూట్ లో కనిపించాల్సి రావడం వల్లే డర్ మూవీని తాను వదులుకున్నట్టు 32 ఏళ్ల తర్వాత రవీనా అసలు విషయాన్ని బయటపెట్టారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి తనకు తానుగా కొన్ని రూల్స్ ను పెట్టుకున్నానని, వాటిని బ్రేక్ చేసి కాంప్రమైజ్ అవడం ఇష్టలేకనే భారీ ఆఫర్ అయినప్పటికీ దాన్ని రిజెక్ట్ చేసినట్టు రవీనా వివరించారు.





# ఫిబ్రవరి 26న విజయ్- రష్మిక పెళ్లి!

విజయ్ దేవరకొండ-రష్మిక మందన్నా వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ఉదయపూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్ లో వీరి పెళ్లి జరగనుందని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సెన్సేషనల్ జంట ఎంగేజ్‌మెంట్, పెళ్లి గురించి రోజుకో వార్త వస్తున్నప్పటికీ అటు రష్మికనో ఇటు విజయ్‌నో దీన్ని ఖండించడం కానీ ఎలాంటి క్లారిటీ ఇవ్వడం కానీ చేయకపోవడంతో ఆ వార్తలకు మరింత ఊపిరి పోసినట్టవుతుంది. మరి విజయ్- రష్మికల పెళ్లి గురించి సోషల్ మీడియాలో వినిపిస్తున్న ముహూర్తం డేట్‌ను శాస్త్రాల ప్రకారం పండితులు ఫిక్స్ చేశారా లేదా నెటిజన్లు ఫిక్స్ చేశారా అనేది తెలియాల్సి ఉంది. ఏదేమైనా విజయ్, రష్మికల గురించి వార్తలు రావడం మాత్రం ఆగడం లేదు.





# కేజీఎఫ్ నటుడు మృతి

సినీ ఇండస్ట్రీలో మరో విషాదం చోటుచేసుకుంది. కేజీఎఫ్ 1 సినిమాలో హీరో యష్ కి ఛాఛా పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు హరీష్ రాయ్. ఖాసిం పాత్రలో గుబురు గడ్డంతో కనిపించి ప్రేక్షకులను మెప్పించిన ఈయన గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. అలాంటి ఈయన ఈరోజు తుది శ్వాస విడిచారు. దీంతో సినీ ఇండస్ట్రీ ఒక్కసారిగా మూగబోయింది. పలువురు ప్రముఖులు, అభిమానులు హరీష్ రాయ్ మరణానికి సంతాపం తెలియజేస్తున్నారు. హరీష్ రాయ్ గత కొంతకాలంగా థైరాయిడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న విషయం తెలిసిందే. కేజిఎఫ్ 1 చిత్రం తర్వాత ఊహించని ఇమేజ్ దక్కించుకున్న హరీష్ రాయ్.. కే జి ఎఫ్ 2 సినిమా విడుదలకు ముందే అంటే 2022లో తనకు గొంతు క్యాన్సర్ ఉందని తెలియజేశారు.

# రాశీ ఖన్నా.. మస్తు లక్కీ

ఢిల్లీ బ్యూటీ రాశీఖన్నా ప్రయాణం టాలీవుడ్, కోలీవుడ్ లో ఎలా సాగిందో చెప్పాల్సిన పనిలేదు. రాశీఖన్నాకి వచ్చినన్నీ అవకాశాలు మరే నటికి రాలేదు. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు రెండు భాషల్లోనూ అవకాశాలు అందుకుంది. మీడియం హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అయింది. కానీ ఫలితాలు మాత్రం కను చూపుఎ మేర ఎక్కడా కనిపించవు. అవకాశాలు అందుకున్నంత వేగంగా అమ్మడి ఖాతాలో విజయాలైతే నమోదు కాలేదు. ఈ విషయంలో రాశీఖన్నా ఎంతో లక్కీ. సాధారణంగా విజయాలు ఉంటే తప్ప అవకాశాలు రావు. కానీ రాశీకి విజయాలులేకపోయినా అవకాశాలు వచ్చాయి. టాలీవుడ్ లో వచ్చినంత కాలం అలాగే ఛాన్సులొచ్చాయి. ఇదే సన్నివేశాన్ని కోలీవుడ్ లో కూడా చూపించింది. ఇలా ఇన్ని అవకాశాలు ఎలా సాధ్యమంటే? ప్రతిభతో దక్కించుకుందా? అంటే అమ్మడు గొప్ప పెర్ఫార్మర్ కూడా కాదు. ఎలాంటి పాత్ర అయినా ఒకేలా నటిస్తుందనే విమర్శ తొలి నుంచి ఉంది. అన్ని సినిమాల్లో నటించిన అనుభవం ఉన్నా? పాత్రలో ఎలాంటి వైవిధ్యత చూపించని ప్రదర్శన ఇస్తుంది. అయినా అవకాశాలు అందుకుందంటే ? కారణం లక్ అనే చెప్పాలి. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ ఎక్కువ సినిమాలు చేస్తోంది. అయితే అక్కడ కూడా ఇక్కడ లాగే అమ్మడిని అందలం ఎక్కిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఓ రెండు..మూడు సినిమాలు చేస్తోంది. 120 బహదూర్ , తాల్కన్ మెయిన్ ఏక్, బ్రిడ్జి చిత్రాల్లో నటిస్తోంది. ఆన్ సెట్స్ లో ఉన్న చిత్రాలివి. అన్ని పనులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది రిలీజ్ కానున్నాయి. గత ఏడాది యోధ, ది సబర్మతి రిపోర్ట్ లాంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అవేవి సరిగ్గా ఆడలేదు. అయినా సరే అమ్మడికి హిందీలో అవకాశాలు క్యూ కడుతున్నాయి. లైనప్ లో ఉన్న సినిమాలతో పాటు, కొన్ని కొత్త కథలు కూడా విందని..వాటికి త్వరలోనే సైన్ చేస్తుందని సమాచారం.









# టీ20 వరల్డ్ కప్
# వేదికలు ఖరారు

**భారత్‌లో ఐదు, శ్రీలంకలో రెండు వేదికల ఎంపిక.. ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోనే జరిగే అవకాశం**

**భద్రతా కారణాలతో బెంగళూరుకు దక్కని చోటు.. సెమీస్‌కు చేరితే స్వదేశంలోనే మ్యాచ్ ఆడనున్న శ్రీలంక**

**వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక వేదికలను ఖరారు చేసింది. భారత్‌లో ఐదు ప్రధాన నగరాలను, శ్రీలంకలో రెండు వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యం ఇచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం భారత్‌లో అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీ నగరాలను మ్యాచ్‌ల నిర్వహణకు ఎంపిక చేశారు. అయితే, ఊహించినట్లుగానే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి ఈ జాబితాలో చోటు దక్కలేదు. గత జూన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన ఘటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన మహిళల వన్డే ప్రపంచకప్‌ను బీసీసీఐ చిన్న నగరాల్లో నిర్వహించింది. అయితే, 20 జట్లు పాల్గొనే టీ20 ప్రపంచకప్‌కు భద్రత అత్యంత కీలకమని భావిస్తున్న ఐసీసీ, ఈసారి కేవలం టైర్-1, మెట్రో నగరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే, తుదిపోరును కొలంబోలో నిర్వహించేందుకు శ్రీలంకను బ్యాకప్ ఆప్షన్‌గా ఉంచారు. అలాగే శ్రీలంక జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంటే, ఆ మ్యాచ్‌ను స్వదేశంలోనే ఆడేలా ఐసీసీ.. బీసీసీఐకి సూచించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటనవెలువడనుంది.

## అహ్మదాబాద్.. వెంటాడుతున్న భయం

అహ్మదాబాద్‌లో ఫైనల్ అంటే భారత అభిమానులు జంకుతున్నారు. గతంలో ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023లో భారత్ ఓడింది. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఫైనల్లో ఆసీస్ చేతిలో మాత్రం ఓటమిపాలైంది. ఈ క్రమంలోనే ఫైనల్‌ను అచ్చొచ్చిన ముంబై వేదికగా నిర్వహించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు బరిలోకి దిగుతున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో ఐదు జట్ల చొప్పున నాలుగు గ్రూప్‌లు చేయనున్నారు. రౌండ్ రాబిన్ పద్ధతిన ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగిలిన జట్లతో తలపడుతుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సూపర్-8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. రౌండ్ రాబిన్ పద్ధతిలో ప్రతీ జట్టు తమ ప్రత్యర్థితో తలపడుతుంది. రెండు గ్రూప్స్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్ చేరుతాయి.

### తెలుగు రాష్ట్రాలకు అన్యాయం..

టీ20 ప్రపంచకప్ వేదికలకు సంబంధించిన షార్ట్ లిస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన మైదానాలు లేవు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంతో పాటు వైజాగ్‌లోని ఏసీ-వీడీసీఏ క్రికెట్ స్టేడియాలను ఎంపిక చేయలేదు. దాంతో తెలుగు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు మైదానాలకు మ్యాచ్‌లు కేటాయించాలని కోరుతున్నారు.




## సుందరం.. వాష్ చేశాడు!

**3 వికెట్లతో అదరగొట్టిన వాషింగ్టన్ సుందర్..**

ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన నాలుగో టీ20లో భారత్ ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్(39 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 46) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అభిషేక్ శర్మ(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28), శివమ్ దూబే(18 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 23), సూర్యకుమార్ యాదవ్(10 బంతుల్లో 2 సిక్స్‌లతో 20) దూకుడుగా ఆడారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడమ్ జంపా మూడేసి వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్(24 బంతుల్లో 4 ఫోర్లతో 30), మాథ్యూ షార్ట్(19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 25) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్, శివమ్ దూబే రెండేసి వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్(3/3) మూడు వికెట్లు పడగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీసారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య ఆఖరి టీ20 శనివారం బ్రిస్బేన్ వేదికగా జరగనుంది. 168 పరుగుల లక్ష్యచేధనలో ఆసీస్ బ్యాటర్లు తడబడ్డారు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. ముఖ్యంగా భారత స్పిన్నర్ల ధాటికి పెవిలియన్‌కు క్యూ కట్టారు. దూకుడుగా ఆడిన మాథ్యూ షార్ట్(25)ను అక్షర్ పటేల్ ఔట్ చేయడంతో పవర్ ప్లేలో ఆసీస్ వికెట్ నష్టానికి 48 పరుగులే చేసింది. అనంతరం జోష్ ఇంగ్లీస్(12)ను అక్షర్ పటేల్ పెవిలియన్ చేర్చగా.. క్రీజులో సెట్ అయిన మిచెల్ మార్ష్(30) శివమ్ దూబే ఔట్ చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో టీమ్ డేవిడ్(14) దూబే బౌలింగ్‌లో క్యాచ్ ఔటవ్వగా.. జోష్ ఫిలిప్(10) అర్ష్‌దీప్ సింగ్ పెవిలియన్ చేర్చాడు. మార్కస్ స్టోయినీస్(17), గ్జేవియర్ బార్ట్‌లెట్(0)ను వాషింగ్టన్ సుందర్ తన వరుస ఓవర్లలో ఔట్ చేయగా.. డేంజరస్ గ్లేన్ మ్యాక్స్‌వెల్‌ను వరుణ్ చక్రవర్తి క్లీన్ బౌల్డ్ చేశాడు. బెన్ ద్వార్షుయిస్(5)ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయగా.. ఆడమ్ జంపా(0)ను సుందర్ పెవిలియన్ చేర్చాడు. దాంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

## రైనా, ధవన్ ఆస్తులు అటాచ్!

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో టీమిండియా మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లకు బిగ్ షాక్ తగిలింది. ఈ ఇద్దరికి చెందిన రూ. 11.14 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేయడం వెనుక ఏదైనా ఆర్థికపరమైన కుట్ర ఉందా? అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌ను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. అక్రమ బెట్టింగ్ ఫ్లాట్‌ఫామ్ వన్ ఎక్స్‌బెట్‌కు ధావన్ ప్రచారకర్తగా వ్యవహరిస్తూ.. భాగస్వామిగా ఉన్నాడని ఈడీ అనుమానిస్తోంది. ఈ అక్రమ బెట్టింగ్ ఫ్లాట్‌ఫామ్‌తో శిఖర్ ధావన్‌కు ఉన్న సంబంధాలపై స్పష్టత కోరేందుకు గత సెప్టెంబర్‌లో ఈడీ విచారణకు పిలిచింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద శిఖర్ ధావన్ వాంగ్మూలాన్ని ఈడీ రికార్డ్ చేసింది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశాడనే అభియోగాలతో సురేశ్ రైనాను ఈడీ ఇప్పటికే 8 గంటలకు పైగా విచారించింది. సదరు బెట్టింగ్ యాప్స్‌లో సురేశ్ రైనాకు కూడా వాటాలు ఉండొచ్చని ఈడీ సందేహిస్తుంది.




**ఫ్రాంచైజీల వారీగా ఆటగాళ్ల రిటైన్, రిలీజ్ జాబితా**

## డబ్ల్యూపీఎల్ 2026
# రిటెన్షన్ లిస్ట్ ఇదే!

వన్డే ప్రపంచకప్ 2025 విజయంతో భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్రను లిఖించింది. అర్థ శతాబ్దపు కలను సాకారం చేసుకుంది. భారత అమ్మాయిల విజయం వెనుక వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) పాత్ర కూడా ఉంది. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న డబ్ల్యూపీఎల్.. నాలుగో సీజన్ కోసం సమాయత్తమవుతుంది. ప్రపంచకప్ విజయం నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌కు ప్రేక్షకాదరణ మరింత రెట్టింపు కానుంది. డబ్ల్యూపీఎల్ 2026 మెగా వేలం నవంబర్ 27న జరగనుంది. ఈ మెగా వేలం రిటెన్షన్ రూల్స్ ప్రకారం ప్రతి జట్టు గరిష్ఠంగా ఐదుగురు ప్లేయర్లను మాత్రమే రిటైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో గరిష్టంగా ముగ్గురు భారత క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు ఫారిన్ ప్లేయర్లు, ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక వేలం పర్స్ వాల్యూను రూ. 15 కోట్లుగా నిర్ణయించారు. రిటైన్ చేసుకునే ఆటగాళ్లలో తొలి ప్లేయర్‌కు రూ. 3.5 కోట్లు, రెండో ప్లేయర్‌కు రూ. 2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ. 1.75 కోట్లు, నాలుగో ప్లేయర్‌కు రూ. 1 కోటి, ఐదో ప్లేయర్‌కు రూ.50 లక్షల ధరను బీసీసీఐ నిర్ణయించింది. గత మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు టైటిల్ గెలవగా.. ఆర్‌సీబీ ఒకసారి గెలిచింది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమకు కలిసొచ్చే ఆటగాళ్లను రిటైన్ చేసుకొని అవసరం లేని ఆటగాళ్లను వేలంలోకి వదిలేసాయి. ఈ ఐదు ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితాలను అధికారిక బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్ గురువారం వెల్లడించింది. ముంబై, ఆర్‌సీబీ, ఢిల్లీ ఐదుగురి ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా.. యూపీ ఒకే ఒక్క ప్లేయర్‌ను అంటిపెట్టుకుంది. గుజరాత్ జెయింట్స్ ఇద్దరు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది.

### ముంబై ఇండియన్స్:

రిటైన్ లిస్ట్: నాట్ సీవర్ బ్రంట్(రూ. 3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్(రూ.2.5 కోట్లు), హీలీ మాథ్యూస్(రూ.1.75 కోట్లు), అమన్ జోత్ కౌర్(రూ. కోటి), జీ కమిలిని(రూ.50 లక్షలు)

రిలీజ్ లిస్ట్: నాడిన్ డి క్లర్క్, అక్షితా మహేశ్వరి, సంస్కృతి గుప్తా, అమేలియా కెర్, క్లో ట్రయాన్, జింటిమణి కలిత, పూజా వస్త్రాకర్, సైకా ఇషాక్, యాస్తికా భాటియా, షబ్నిమ్ ఇస్మాయిల్, ఎస్ సజన, అమన్‌దీప్ కౌర్, కీర్తన బాలకృష్ణన్. **మిగిలిన పర్స్ వాల్యూ: రూ.5.75 కోట్లు**

### ఢిల్లీ క్యాపిటల్స్:

రిటైన్ లిస్ట్: జెమీమా రోడ్రిగ్స్(రూ.2.2 కోట్లు), మారిజానే కాప్(రూ.2.2 కోట్లు), షెఫాలీ వర్మ(రూ. 2.2 కోట్లు), అన్నబెల్ సదర్లాండ్(రూ.2.2 కోట్లు), నికీ ప్రసాద్(రూ.50 లక్షలు)

రిలీజ్ లిస్ట్: ఎన్. చరణి, నందిని కశ్యప్, సారా బ్రైస్, నికి ప్రసాద్, అలిస్ క్యాప్సే, అరుంధతి రెడ్డి, జెస్ జోనాస్సెన్, మెగ్ లానింగ్, మిన్ను మణి, రాధా యాదవ్, శిఖా పాండే, స్నేహ దీప్తి, తానియా భాటియా, టిటాస్ సాధు. **మిగిలిన పర్స్ వాల్యూ: రూ.5.7 కోట్లు**

### ఆర్సీబీ:

రిటైన్ లిస్ట్: స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రిచా ఘోష్(రూ.2.75 కోట్లు), ఎల్లిస్ పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్(రూ.60 లక్షలు)

రిలీజ్ లిస్ట్: జోషిత, రాఘవి బిస్త్, జాగ్రవి పవార్, ప్రేమ రావత్, సబ్బినేని మేఘన, జార్జియో వేర్‌హమ్, ఆషా శోభనా, సోఫీ డివైన్, రేణుకా **మిగిలిన పర్స్ వాల్యూ: రూ.6.5 కోట్లు**

### యూపీ వారియర్స్:

రిటైన్ లిస్ట్: శ్వేత సెహ్రావత్(రూ.50 లక్షలు)

రిలీజ్ లిస్ట్: అలానా కింగ్, అరుషి గోయెల్, క్రాంతి గౌడ్, అలిస్సా హీలీ, అంజలి సర్వాణి, దీప్తి శర్మ, గ్రేస్ హారిస్, కిరణ్ నవ్‌గిరే, చమరి అతపత్తు, రాజేశ్వరి గయాక్‌వాడ్, సోఫీ ఎక్లెస్టోన్, తహ్లియా మెక్‌గ్రాత్, బృందా దినేష్, పూనమ్ ఖేమ్నార్, సైమా థాకనా, సైమా థాకనా

**మిగిలిన పర్స్ వాల్యూ: రూ.14.5 కోట్లు**

### గుజరాత్ జెయింట్స్:

రిటెన్షన్ లిస్ట్: అష్లే గార్డ్‌నర్(రూ.3.5 కోట్లు), బెత్ మూనీ(రూ.2.5 కోట్లు)

రిలీజ్ లిస్ట్: సిమ్రాన్ షేక్, డియాండ్రా డాటిన్, డేనియల్ గిబ్సన్, ప్రకాశిక నాయక్, దయాళన్ హేమలత, హర్లీన్ డియోల్, లారా వోల్వార్డ్, షబ్నమ్ షకీల్, తనూజా కన్వర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, మేఘనా సింగ్, కష్వీ గౌతమ్, ప్రియా మిశ్రా, మన్నత్ కశ్యప్, సయాలీ సత్‌గారే.



# నరనరాన వందేమాతరం

వందేమాతరం!
స్వాతంత్ర్య స్ఫూర్తిని గానం చేసే అమృత ధ్వని.
బంకించంద్రుని కలం నుండి జాలువారిన
సప్తకోటి కంఠాల సారం, దేశభక్తి దీపం!
సింధు తీరం నుండి హిమగిరి శిఖరం వరకు,
సప్త నదులు పాడే స్వరమయ జయగానం.
సుజలాం సుఫలాం – ఆ ధాత్రి దివ్యరూపం,
మలయజ శీతల గాలుల్లో మమతలు
నిండిన మాతృహృదయం.
ఇరువది కోటి బాహువులు ఎగిరిన ధ్వజం,
ఎనభై కోటి ముఖాలు పలికిన జై భారతం!
చంద్ర శేఖర, గాంధీజీల ఆశయాల తీరం,
వందేమాతరం – నీవే మా ప్రాణస్వరూపం!
ఆ గేయం పాడితే రక్తం మరుగున ఉరకలాడుతుంది,
చరిత్ర పుటలు తిరిగి జీవించి నిలుస్తాయి.
ఓ భారతమాత! నీ పాదాలకు వందనం!!

వందేమాతరం.. వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్య శ్యామలాం మాతరం
-- వందేమాతరం --

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీమ్
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్
సుహాసినీం సుమధుర భాషిణీమ్
సుఖదాం వరదాం మాతరం
-- వందేమాతరం --

కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే
కోటి కోటి భుజైర్ధృత ఖర కరవాలే
అబలా కేనో మాఁ ఎతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం
-- వందేమాతరం --

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణాః శరీరే
బాహుతే తుమి మాఁ శక్తి
హృదయే తుమి మాఁ భక్తి
తోమారయి ప్రతిమాగడి
మందిరే మందిరే
-- వందేమాతరం --

త్వం హి దుర్గా దశప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం,
నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం,
సుఫలాం, మాతరం
-- వందేమాతరం --

బెంగాల్‌లో డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా ఉన్న బంకించంద్ర ఛటోపాధ్యాయ జీవితంలో ఒక సంఘటనే ఆ గీతానికి పునాదిగా నిలిచింది. ఒకరోజు రథంలో ప్రయాణిస్తుండగా ఓ బ్రిటిష్ లెఫ్టినెంట్ కల్నల్ డఫిన్ బంకించంద్ర ఛటోపాధ్యాయను అవమానించాడు. బంకిమ్‌చంద్రపై చేయి చేసుకున్న ఆ తెల్లదొరపై ఆయన క్రిమినల్ కేసు వేశారు. విచారణ సమయంలో జడ్జి సర్దిచెప్పడానికి ప్రయత్నించినా, బంకించంద్ర తన గౌరవం మీద రాజీపడలేదు. చివరికి డఫిన్ కోర్టులో బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. అయినా బంకించంద్ర మనసులోని అవమానాగ్ని ఆరలేదు. "నన్నే ఇలా అవమానిస్తే సామాన్యుడి పరిస్థితి ఏమవుతుందీ?" అని కలత చెంది, కొద్ది రోజుల సెలవు తీసుకుని కోల్‌కతాకు బయలుదేరాడు. అప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం తమ ప్రార్థనగీతం 'గాడ్ సేవ్ ద కింగ్'ను భారత జాతీయ గీతంగా ప్రకటించేందుకు ప్రయత్నిస్తున్నదనే వార్త వినగానే ఆయన ఆగ్రహంతో తట్టుకోలేకపోయాడు. ఆ ఆవేశమే ఆయన కలం నుంచి అమరమైన పదాలుగా జాలువారింది. వందేమాతరం.. సుజలాం సుఫలాం మలయజశీతలాం... సస్యశ్యామలాం మాతరం... ఈ రెండు పాదాలే ఆయన 1875 నవంబర్ 7న రాసిన మొదటి రూపం. బెంగాల్‌లో అప్పటికే ఆధునిక సాహితీ సమ్రాట్‌గా పేరు తెచ్చుకున్న బంకించంద్ర 'దుర్గేశనందిని', 'అనుశీలన మిత్ర' వంటి నవలలతో కీర్తి గడించాడు. కానీ 'వందేమాతరం' పండితులకు పెద్దగా నచ్చలేదు. సంస్కృతం, బెంగాలీ భాషల కలగాపులగం కారణంగా విమర్శలు వెల్లువెత్తాయి. మీకు నచ్చకపోతే విసిరి పారేయండి అంటూ ఆయన నిర్లిప్తంగా స్పందించాడు. తన జీవితకాలంలో ఈ పాట ప్రజల్లోకి పెద్దగా చేరలేదు. తర్వాత ఆయన 'ఆనందమఠ్' నవలలో దాన్ని ప్రార్థనగీతంగా చేర్చాడు. మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ గేయంలోని గాఢతను గుర్తించాడు. 1886లో కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో తానే స్వయంగా దానికి బాణీ కట్టి ఆలపించాడు. బంకిం మరణానంతరం (1895) ఈ గేయం ఆవశ్యకతను దేశం అర్థం చేసుకుంది. 1905లో బెంగాల్ విభజన సమయంలో ఇది స్వదేశీ ఉద్యమానికి చిహ్నంగా మారింది. ఠాగూర్ నేతృత్వంలో ప్రజలు రాఖీ కట్టుకుంటూ హిందూ–ముస్లిం ఐక్యతకు సంకేతంగా "వందేమాతరం" నినాదాలు చేశారు. వందేమాతరం విప్లవ సాహిత్యానికి మూలంగా మారింది. బెంగాల్ విప్లవకారులు ఈ గేయాన్ని దేశమంతా వ్యాప్తి చేశారు. అరవింద్ ఘోష్ మొదటిసారిగా దీనిని ఇంగ్లిష్‌లోకి అనువదించాడు. 1906లో పాథేఫోన్స్ కంపెనీ గ్రామఫోన్ రికార్డుగా విడుదల చేసింది. బ్రిటిష్ పాలకులు దీని తీవ్రత గ్రహించి నిషేధం విధించారు. ఆ నిర్ణయం భారతీయులలో తిరుగుబాటు జ్వాలలను రగిలించింది. ఆంధ్రభూమిపై 'వందేమాతరం' ప్రతిధ్వని 1907లో రాజమహేంద్రవరం విద్యార్థులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో మొదటిసారిగా వందేమాతరాన్ని ఊరేగింపుగా పాడారు. ప్రిన్సిపల్ హంటర్ ఆయనను కాలేజీ నుంచి బహిష్కరించగా విద్యార్థుల్లో ఆగ్రహం రేగింది. గ్రామాల్లో వందేమాతరం సంఘాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో చిన్నపరెడ్డి అనే రైతు ఇంగ్లిషు అధికారిపై తిరుగుబాటు చేయడం, ఉరిశిక్షకు గురవడం.. ఈ గేయం ప్రభావం ఎంత లోతుగా ఉందో చూపించింది. 1908లో ఉరిశిక్షకు గురైన కుదిరామ్ బోస్ చివరి నిమిషంలో "వందేమాతరం" అంటూ చిరునవ్వుతో ఉరికొయ్య వైపు నడిచాడు. అదే గీతం బుధు నోనియా అనే బాలుడి పెదవులపై కూడా వినిపించింది. అతను ఉప్పు కొలిమిలో కాలిపోయే వరకు ఆ నినాదమే చేశాడు. మాతంగి హజ్రా కాల్పుల మధ్య ప్రాణాలు విడిచే క్షణంలో కూడా అదే నినాదం పలికింది.

తెలంగాణలోనూ 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు వందేమాతరాన్ని పాడడంతో ఉద్యమం మొదలైంది. నిజాం వణికిపోయాడు. బహిష్కరణలు, నిరసనలు కొనసాగాయి. 1920 వరకూ వందేమాతరం అన్ని మతాలవారి గీతం. కానీ బ్రిటిషువారు మతభేదాలు రేపి దీనిని హిందువుల ప్రార్థనా గీతమని దుష్ప్రచారం చేశారు. కాంగ్రెస్ 1937లో దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి నెహ్రూ, ఠాగూర్ సలహా తీసుకుంది. ఠాగూర్ తొలి రెండు పాదాలు ఎటువంటి మతవ్యతిరేకతలతో లేవని తెలిపినా పార్టీ వెనుకడుగు వేసింది. దీనితో సుభాష్ చంద్రబోస్ అసంతృప్తి చెందగా, గాంధీ దీన్ని "మన హృదయాల గీతం"గా అభివర్ణించారు. స్వాతంత్ర్య ఉద్యమం 1947 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్యం సాధించిన ఉదయం.. ఆకాశవాణిలో మొదటగా వినిపించిన గీతం వందేమాతరం. రాజ్యాంగ పరిషత్తు 1950లో దీనికి "జనగణమన"తో సమాన హోదా కల్పించింది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్.. వందేమాతరం స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని ప్రకటిస్తూ, జాతీయ గీతం జనగణమనతో సమానంగా వందేమాతరానికి గౌరవం ఇచ్చారు. 1947లో పార్లమెంట్‌లో ఓమ్‌ప్రకాశ్ వందేమాతరాన్ని అచ్చమైన గాత్రంతో ఆలపించాడు. దూరదర్శన్‌లో సుప్రభాత గీతంగా ఇప్పటికీ నేపథ్య సంగీతం లేకుండా వినిపిస్తుంది. బీబీసీ పోల్‌లో ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గీతాల్లో రెండో స్థానంలో నిలిచింది. 1906లో ఠాగూర్ గళంలో రికార్డైన ఒరిజినల్ కాపీని 1966లో ఇందిరాగాంధీ భారతానికి తెప్పించారు. శాశ్వత నినాదం అసతోమా సద్గమయ, సత్యమేవ జయతే, జననీ జన్మభూమిశ్చ, మా ఫలేషు కదాచన.. ఇవన్నీ మానవ వికాసాన్ని సూచించే వాక్యాలు. వాటిలాగే 'వందేమాతరం' కూడా ఒక ఆత్మనినాదం, ఒక శాశ్వత జాతీయ గీతం. ఎప్పటికీ మార్మోగే విప్లవ నినాదం.

## వర్ణణ ఇదీ..

బంకించంద్రుడు మాతృప్రేమతో వందేమాతర గీతంలో భారతభూమి సర్వసంపన్నత, వైభవాలను, 'సుజల', 'సుఫల', 'సస్యశ్యామల' – అనే పదాలతో పల్లవిలో వర్ణించారు. భారతభూమి ఇంతటి సంపదలతో తులతూగాలంటే అక్కడ నివసించే వారి మనస్తత్వం చందనంలా ఉండాలనే దృఢ సంకల్పం ఆయన మనసులో ఉంది. ఎందుకంటే మలయ పర్వతాలు చందన వృక్షాలకు ప్రసిద్ధి. చందనాన్ని అరగ దీస్తే సుగంధం వెలువడుతుంది. అది గాలిలో కలిసినప్పుడు చల్లదనాన్నిస్తుంది. భారతభూమిలో సంవత్సరంలో 8 నెలలు ఎలాంటి ముసురులేకుండా ఆకాశం స్వచ్ఛంగా ఉంటుంది చల్లని వెన్నెల రాత్రులు ఆహ్లాదాన్నిస్తాయి. సూర్యరశ్మి కావలసినంతగా ఉంటుంది. వర్షపాతం అవసరమైనంత మాత్రమే ఉంటుంది. దాంతో వాతావరణం వింతసోయగాన్ని కల్గి ఉంటుంది. అందువల్ల ఈ భూమి మిగిలిన ప్రపంచదేశాలకన్నా ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. ఈ భూమిలో అన్ని పంటలూ పుష్కలంగా పండుతాయి. భారతభూమి కున్న ఈ ప్రత్యేకతలను వర్ణిస్తూ, తల్లికి ఉండే ఎన్నో విశేషణాలు బంకించంద్రుడి మనస్సులో మెదిలి ఈ చరణంలో వచ్చాయి. పరపాలనతో బలహీన పడటం వలన ఏర్పడిన అప్పటి దేశపరిస్థితలను గమనించి, భారత్కు పట్టిన గ్రహణం విడిచిన తర్వాత దృశ్యం ఎలా... ఉంటుందనే విషయాన్ని మూడవ చరణంలో కవి మనముందు ఆవిష్కరించాడు. భారత ప్రజలు శక్తి సంపన్నులై, ఆయుధ ధారులై, శత్రుమూకలను చీల్చి చెండాడుతుండగల్గడం, వాళ్ళు బలహీనులు కారనే దృశ్యం ఆయన కళ్ళముందు సాక్షాత్కరించింది. తర్వాతి చరణంలో ప్రపంచంలోని అన్ని విద్యలకు మన భారతమాతే జన్మభూమిగా విరాజిల్లుతున్న భావన కవికి మదిలో మెదిలింది. సమాజ జీవనం సరైన పంథాలో ముందుకు సాగటానికి ప్రతివ్యక్తి ఏమిచేయాలి? ప్రతి వ్యక్తి కర్తవ్యమేమిటి? ధర్మమేమిటి? వ్యక్తులంతా తమ తమ ధర్మాన్ని పాటించాలనే విషయం భారతదేశంలో చెప్పబడింది. తమ తమ కర్తవ్యాన్ని ఈ మాతృభూమి సేవకై వినియోగించాలనేది ఈ ధర్మానికి చెప్పబడిన అర్థం. మాతృభూమి కోసం పనిచేయటమే నాధర్మం. ప్రాణంతో ఉండి కూడా మాతృభూమికోసం పనిచేయకపోతే ప్రాణం లేనట్లేనని ఇక్కడివారి కన్పిస్తుంది. మాతృభూమిపట్ల భక్తి కలిగి ఉండటమే ఇక్కడున్న ప్రతి ఒక్కరి సర్వస్వం. భుజాల్లో శక్తి, హృదయంలో భక్తి ఉండటంతో ఇక్కడి వారికి ప్రతి మందిరంలో మాతృభూమి దివ్యమంగళ విగ్రహం కన్పిస్తుంది. అయిదవ చరణంలో మాతృభూమి స్తోత్రం పఠిస్తున్నప్పుడు కవికి దేవి మూడు రూపాల్లో దర్శనం ఇచ్చింది. 'దశప్రహరణ ధారిణి దుర్గ', 'కమల దళ విహారిణి లక్ష్మి', 'వాణీ విద్యా దాయిని సరస్వతి'గా భారతమాతను దర్శించటంతో కవిలో భావావేశం పొంగిపొర్లి ఈ చరణంలో తర్వాతి విశేషణాలు స్ఫురించాయి. అవి 'అమలాం', 'అతులాం', 'సుజలాం', "సుఫలాం', "శ్యామలాం', 'సరలాం','సుస్మితాం', "భూషితాం', 'ధరణీం', భరణీం' ఈ భావాలన్నీ హృదయాంతరంగాల్లో మారు మ్రోగగా వందేమాతరం, వందేమాతరం అంటూ గీతాన్ని పూర్తి చేశాడు బంకించంద్రుడు. కవి మనస్సులోని 'మాతృభూమే నా సర్వస్వం' అనే భావన కోటికోటి కంఠాలలో నుండి ' ప్రతిధ్వనించాలంటే వారందరిలోనూ అదే భావావేశం రావాలి. అపుడే కోటికోటి భుజాలతో ఖడ్గధారులై స్వాతంత్ర్య సాధనకు, దేశరక్షణకు సైనికులు దశప్రహరణధారులవుతారు. విదేశీయులచే చీరకొంగు లాగబడుతున్న లక్ష్మీదేవి, వారి చెరనుండి తప్పించుకొని కమలంపై పునఃప్రతిష్ఠితమవుతుందప్పుడు. విదేశీయుల చేతిలో బానిసగా మారిన సరస్వతీదేవి, వారిచేతులనుండి విముక్తమై ప్రపంచానికి జ్ఞానాన్ని ప్రసరింపజేస్తుంది. శస్త్రశక్తికి, శాస్త్ర, శక్తికి, ధనశక్తికి మళ్ళీ పూర్వ వైభవం సంప్రాప్తిస్తుంది. దాస్యం నుండి భారతదేశం విముక్తం కావాలనే బంకించంద్రుని హృదయంలోని ఆకాంక్ష ఆయన 'కమలా కాంతేర్ దప్తర్' అనే నవలలో కన్పిస్తుంది. అందులో ఆయన ఇలా వ్రాశారు. 'నేను ఒడ్డుకు దూరంగా సాగర జలాలపై తేలియాడుతున్న తెప్పపై కూర్చుని ఉన్నాను. చీకటిగా ఉన్న ఒడ్డుపై ఇంకెవరూ లేరు. ఒంటరిగా ఉన్న నేను భయంతో అమ్మా! అమ్మా! అని అరుస్తున్నాను. ఆ సమయంలో క్షితిజంపై అలలలో ఒక మాతృమూర్తి దర్శనమిచ్చింది. చిరునవ్వుతో, ప్రకాశవంతమైన వెలుగులతో దశభుజ, శస్త్రధారి, భూమి స్వరూప, రత్నాలంకృత, సింహవాహిని, శత్రుసంహారిణి అయిన తల్లిని నేను చూశాను. అంతటి శోభాయమానంగా వెలుగొందుతున్న ఆ తల్లి చాలా దూరంగా ఉంది. మనమందరమూ ఆ సాగరజలాల్లోకి దూకి, ఈదుకుంటూ ఆమె వద్దకు చేరుకుంటాము' ఇటువంటి మాతృభూమి స్వరూపం వందేమాతరం అనే గీత రూపంలో కార్తీక శుద్ధ నవమి నాడు స్ఫురించింది. అదృష్టవశాత్తూ ఆయన సంపాదకత్వంలో వెలువడే 'వంగదర్శన్' పత్రిక మరుసటిరోజు అచ్చవుతున్న సమయంలో సరిగ్గా ఆ గీతం సరిపోయేటంత ఖాళీ స్థలం మిగిలిపోయింది. ఆ ఖాళీ స్థలంలో ఆగీతాన్ని పొందుపరచారు. అది చూసి బంకించంద్రుడు 'గీత మైతే అచ్చయింది. అయితే దానిలో ఉన్న భావం అర్థం కావటానికి 25 లేదా 30 సంవత్సరాలు పడుతుంది' అన్నారు. జరిగింది కూడా అదే. అతని సన్నిహితులు కొందరు, ఆ గీతంలో సంస్కృత శబ్దాలు ఎక్కువగా ఉన్నాయని ఆక్షేపించినా, 1880 సం॥లో తాను వ్రాసిన 'ఆనందమఠం' నవలలో ఆ గీతాన్ని ఉన్నదున్నట్లుగా పొందుపరచాడు. భవిష్యత్తులో ఆ గీతానికి, ఆ పదాలకు అత్యున్నత మహత్వం కల్గుతుందనే ఆత్మవిశ్వాసం ఆయనకుండేది. ఆనందమఠం నవలలో ఆ గీతాన్ని పాడుతూ భవానందుడు ఇలా అంటాడు. 'మాకు తల్లిలేదు, తండ్రిలేదు, అన్నా, అక్కలెవరూ లేరు. స్నేహితులు లేరు, భార్యా పిల్లలు లేరు. ఇల్లూ వాకిలి కూడా లేదు. కేవలం మాకున్నదొక్కటే. అదే సుజల, సుఫల, సస్యశ్యామల అయిన మాత. మేమందరం ఆమె సంతానం'. బంకించంద్రుడు ఈగీతం గురించి తన అక్కకొడుకుతో చర్చిస్తూ 'ఈ గీతం శాశ్వతంగా నిలుస్తుంది. ఈ దేశవాసులందరి హృదయాలను ఆకర్షిస్తుంది, జయిస్తుంది' అన్నారు. తన కూతురుతో మాట్లాడుతూ 'ఒకనాటికి ఈ గీతాన్ని వంగభూమియే కాక దేశమంతటా ప్రజలు ఒకే కంఠంతో స్ఫూర్తివంతంగా పాడుతూ నృత్యాలను అభినయిస్తారు' అన్నారు. ఆయన చెప్పిన విషయాలు 25లేదా 30 సం%శ్రీశ్రీ%ల తర్వాత అని చెప్పటంతో ఆయనను 'ద్రష్ట' అంటున్నాం. కానీ వందేమాతరం మంత్ర సామర్థ్యాన్ని దర్శించటానికి అప్పటిదాకా బంకించంద్ర సజీవులుగా లేరు.

## ఏడాది పాటు వేడుకలు



జాతీయ గీతం 'వందేమాతరానికి' 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనుంది. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరగనున్నాయి. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు జరగనున్నాయి. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.


**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.